

దర్శించండి - తరించండి

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం

కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.

సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...

శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి

శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్

A/c No. 30178925930, IFSC No. SBIN0010105

మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



SINCE: 1984

చైతన్య కాలేజ్

Cell: 93908 22625

ONE SITTING (For Discontinued)

B.Tech, M.Tech, Diploma
M.B.A, M.C.A, M.Sc, M.A.
B.A, B.Com, B.Sc, B.B.A,
U.G.C. Recog. Universities
10th & Inter TOSS / APOSS / NIOS



డైరెక్టర్: బి.వి. త్రినాథ్ M.A, M.Ed, M.Phil, L.L.B



| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 158 | ది.24-9-2026 | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 158 | Date : 24-9-2026 | Thursday | Pages : 8 | Rs.1/- |


## రాజధాని లో 50 వేల కోట్ల పనులు..
## అమరావతిలో ప్రపంచ స్థాయి నేత్ర వైద్య కేంద్రం

- స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్య సాధనకు పాన్ ఐఐటీ నిపుణులు
- అమరావతిలో ఎల్వీ ప్రసాద్ ఐ సంస్థకు సీఎం చంద్రబాబు భూమి పూజ





**అమరావతి,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** రాజధాని అమరావతిలో మరో ప్రతిష్ఠాత్మక సంస్థకు అడుగులు పడ్డాయి. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం వద్ద ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూమిపూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి నిర్మాణ పనులను ప్రారంభించారు. సుధా, వెంకట్ జాస్తి క్యాంపస్ పేరుతో 12 ఎకరాల్లో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌ను నిర్మించనున్నారు. ఏటా సుమారు 3 లక్షల మందికి కంటి వైద్య సేవలు అందించేలా ఆస్పత్రి నిర్మాణం కానుంది. చికిత్సలతో పాటు నేత్ర వైద్య పరిశోధన, శిక్షణ, కమ్యూనిటీ హెల్త్ కార్యక్రమాలపైనా సంస్థ దృష్టి సారించనుంది. ప్రత్యేకంగా ఐ అండ్ బ్రెయిన్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. భూమిపూజ అనంతరం బహిరంగ సభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి... శరవేగంగా నిర్మితమవుతున్న అమరావతికి ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ రావడం గర్వకారణమన్నారు. ఇప్పటికే 3 కోట్ల కంటి చికిత్సలు అందించిన సంస్థ అమరావతి నుంచి మరింత విస్తృతంగా సేవలందిస్తుందని తెలిపారు. అమరావతి కేంద్రాన్ని ప్రపంచంలోని అత్యుత్తమ నేత్ర వైద్య పరిశోధన సంస్థగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. కంటి చికిత్సలతో పాటు పరిశోధన, శిక్షణ రంగాల్లోనూ ప్రపంచస్థాయి కేంద్రంగా ఎదగాలని కోరారు. పేదలకు కంటి వైద్యం అందించడంలో ఎల్వీ ప్రసాద్ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని సీఎం పేర్కొన్నారు. నాలుగు రాష్ట్రాల్లో 319 కేంద్రాల ద్వారా సేవలు అందిస్తోందన్నారు. డిజిటల్ హెల్త్ ఐ ప్రొఫైల్ ద్వారా ప్రజలకు సకాలంలో చికిత్స అందించేలా సంస్థ పనిచేస్తోందని తెలిపారు. అమరావతిలో ఐ అండ్ బ్రెయిన్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న జీఎన్ రావు, జాస్తి వెంకట్‌లను సీఎం అభినందించారు.



**క్వాంటం కేంద్రంగా అమరావతి..** ఇప్పుడు అమరావతి గురించి దేశం అంతా మాట్లాడుతోందని...మన ప్రజా రాజధానిని ప్రపంచం కూడా గుర్తిస్తోందని సీఎం అన్నారు. నోపోల్ సిటీ, బ్లూ-గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ, కార్బన్ న్యూట్రల్, డీప్‌టెక్ క్యాపిటల్‌గా అమరావతిని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దడంతో పాటు విస్తృతంగా హరిత ప్రాంతాలను అభివృద్ధి చేసి, గ్రీన్ ఎనర్జీని వినియోగించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఐటీ తర్వాత క్వాంటం కంప్యూటింగ్‌పై దృష్టి సారించామని సీఎం తెలిపారు. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం అమరావతిలో ఏర్పాటు అవుతోందన్నారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్అండ్‌టీ సంస్థల భాగస్వామ్యంతో 133 క్యూబిట్ సామర్థ్యం కలిగిన క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 21 క్వాంటం స్టార్టప్‌లు అమరావతిలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఐదు క్వాంటం కంప్యూటింగ్ సంస్థలు మూడు క్యూబిట్ కంప్యూటర్లను తయారు చేశాయని పేర్కొన్నారు.

## డీఎస్సీ--2025 స్కామ్‌పై సీబీఐ విచారణ జరిపించండి

### -గవర్నర్ ను కలిసిన మాజీ సీఎం వైయస్ జగన్

**విజయవాడ,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** లోక్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి బృందం కలిసింది. శాప్ కార్యాలయం వద్ద వైయస్సార్‌సీపీ నాయకులపై జరిగిన దాడికి సంబంధించి ఆయన గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే డీఎస్సీ--2025లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. గవర్నర్‌తో భేటీ అనంతరం లోక్‌భవన్ వద్ద మీడియాతో వైయస్ జగన్ మాట్లాడుతూ డీఎస్సీ స్కామ్‌లో ఇవీ నాలుగు పాయింట్లు ఉన్నాయన్నారు. ఇప్పుడే గవర్నర్‌ని కలవడం జరిగింది. గవర్నర్ కి వివరంగా చెప్పటం జరిగిందన్నారు. సెప్టెంబరు 21న జరిగిన ఘటనపైనే కాకుండా, ఏ విధంగా డీఎస్సీ స్కామ్‌లో యువత నష్టపోయింది అనేది వివరించాము. ఈ వ్యవస్థలో ఒక మార్పు రావాలన్నా, ఈ వ్యవస్థ మీద ప్రజలకు మళ్లీ నమ్మకం రావాలన్నా, ఈ వ్యవస్థలో లోపాలు సవరించాలన్నా డీఎస్సీ స్కామ్‌పై కచ్చితంగా సీబీఐ విచారణ జరగాలనీ,అదే విధంగా విద్యా శాఖ మంత్రి రాజీనామా కూడా చేయాలన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా, నాలుగు పాయింట్ల ఆధారంగా డీఎస్సీలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. మొట్టమొదట రెండు ఫంక్షన్లు ఒకే వ్యక్తి చేతికి అప్పగించడం. ప్రశ్నపత్రం తయారీ, పరీక్ష నిర్వహణ రెండూ ఎస్సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు అప్పగించారన్నారు. దీంతో స్కామ్ ప్రారంభం అయిందన్నారు.రెండోది మొత్తం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల చేతిలో పెట్టారనీ,. అలా పని చేస్తున్న నవీన్ అనే వ్యక్తికి కృష్ణా జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ వచ్చినా, అతడికి ఉద్యోగం ఇవ్వలేదన్నారు. తన పేరు తొలి మెరిట్ లిస్ట్‌లో చూపి, ఆ తర్వాత లిస్ట్‌లో పేరు తొలగించారన్నారు. అతడి లాగిన్ ఐడీ బ్లాక్ చేశారు. కాల్ లెటర్ కూడా పంపలేదు. దీంతో అతడు ప్రభుత్వానికి లేఖ రాయడమే కాకుండా, కోర్టుకు కూడా వెళ్లాడన్నారు. అంటే ఒక స్కామ్‌ను కవర్ చేయడానికి ఎన్ని అగచాట్లు పడుతున్నారు. అనేది తెలియడంతో పాటు, లీకేజీ వ్యవహారం బట్టబయలైందన్నారు. స్పోర్ట్స్ కోటా పేరుతో అడ్డగోలుగా జీఓలు ఇచ్చారు. గతంలో ఉన్న జీఓలు రద్దు చేసి కొత్తగా.. జీఓ నెం: 4, 47 అని చెప్పి, రెండు కొత్త జీఓలు తెచ్చి, వాటి ద్వారా పరీక్ష రాయాల్సిన అవసరం లేకుండా ఉద్యోగాలు ఇచ్చారన్నారు.ఆ తర్వాత 372 ఉద్యోగాలు ఆ జీఓల పేరుతో ఇచ్చారు. ఆ రిక్రూట్‌మెంట్ పూర్తి కాగానే మళ్లీ మూడు జీఓలు తెచ్చారు. జీఓ నెం: 23, 25, 56 తెచ్చారు. దాని ప్రకారం మళ్లీ పరీక్ష ఉండాలని నిబంధన పెట్టారన్నారు. మరి ఇక్కడ 372 మందికి ఎలా ఉద్యోగాలు ఇచ్చారన్న దానికి సమాధానం లేదన్నారు. ఏరకంగా నారా లోకేష్ తోడల్లుడు, విశాఖ ఎంపీ భరత్ దొంగ సర్టిఫికెట్లు ఇచ్చాడో చూశాం. జరగని గేమ్స్ జరిగినట్లు చూపారన్నారు. అలాగే ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అయిన ఎమ్మెల్యే కూన రవికుమార్ దాదాపు 38 ఉద్యోగాలకు సంబంధించి, సర్టిఫికెట్లు ఇచ్చారనేది కూడా చెప్పానన్నారు. ఇంకాసాఫ్ట్‌బాల్ అసోసియేషన్లకు సంబంధించి కొన్ని జిల్లాలో సెక్రటరీలకు, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చారు అనేవి కూడా చెప్పామన్నారు. డీఎస్సీ ఉద్యోగాలకు సంబంధించి బేరసారాలపై



ఆడియో, వీడియో కూడా బయటకు వచ్చిందన్నారు. అందులో క్లియర్‌గా ఫోన్ నెంబర్ కనిపిస్తున్నా, ఆ వ్యక్తి గురించి ఎఫ్ఐఆర్‌లో రాయలేదు. కేవలం సస్పెక్ట్ అని మాత్రమే రాశారు. అరెస్టు కూడా చేయకుండా స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. అయినా సీఎం చంద్రబాబు అసెంబ్లీలో అబద్ధాలు చెప్పారన్నారు.

**శాప్ ఆఫీస్ వద్ద టీడీపీ గుండాల దాడి:** సెప్టెంబరు 21న శాప్ ఆఫీస్ వద్ద శాంతియుత నిరసన వ్యక్తం చేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముందుగానే సమాచారం ఇచ్చారు. అనుమతి కోరుతూ లెటర్ కూడా రాశాడు. కానీ, ఆరోజు ఏం జరిగింది. అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఎలా కుట్ర చేశారో చూశానన్నారు. టీచర్లు కాని టీచర్లను పిలిపించి, ప్యారలల్‌గా ధర్నా చేయించాడు. నిజానికి వారు చదువు చెప్పే గురువులు కాదు. దొంగ సర్టిఫికెట్లతో, ఏ పరీక్ష రాయకుండా ఉద్యోగాలు పొందిన వారు. అందుకే వారు టీచర్లు కానీ టీచర్లు. వారిని పిలిపించి, కావాలని శాప్ ఆఫీస్ వద్ద గొడవ చేయించారన్నారు. అంతే కాకుండా టీడీపీ గుండాలను కూడా అక్కడికి రప్పించారు. వారంతా కలిసి మా పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువకులపై దారుణంగా దాడి చేశారన్నారు. అసలు వారంతా ఎవరో చూడండి. వీరు గతంలో సాక్షి ఆఫీస్‌పై దాడి చేసింది కూడా వీరే అంటూ, ఆ ఫోటోలు మీడియాకు చూపారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న మా పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువకులపై ఆ విధంగా టీడీపీ గుండాలు అంత దారుణంగా దాడి చేసినా, వారిపై ఎలాంటి చర్యలు లేవు. వారిపై కేసులు నమోదు చేయలేదు. అందుకు పూర్తి భిన్నంగా, రివర్స్‌లో మా పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువకులపై కేసు పెట్టారన్నారు. ఎంత దారుణంగా ఆ కేసులు పెట్టారంటే.. హత్యాయత్నం కేసులు. ఎస్సీ ఎస్టీ అత్యాచార కేసులు పెట్టారు. ఇప్పటికే 350 మందిపై కేసులు పెట్టారు. ఆ జాబితా ఇంకా పెరుగుతోందన్నారు. ఇంకా రాత్రి వేళల్లో ఇళ్లపై బడి అరెస్టులు చేస్తున్నారనీ ఆందోళన వ్యక్తం చేశారు. అయితే అదృష్టవశాత్తూ.. కోర్టులు వాటిని తప్పు పడుతున్నాయి. దీని వల్ల సామాన్యులు బ్రతుకుతున్నారన్నారు.

## తుఫానుపై ఆర్టీజీఎస్ అప్రమత్తం

- నిరంతర పర్యవేక్షణ
- ప్రభావిత జిల్లాల యంత్రాంగంతో సమన్వయం
- తుఫాను గమనంపై ఎప్పటికప్పుడు సమాచారం చేరవేత

**అమరావతి,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** ఉత్తరాంధ్రపై తుఫాన్ ప్రభావం నేపథ్యంలో సచివాలయంలోని రియల్ టైమ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) పూర్తి స్థాయిలో అప్రమత్తమైంది. ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి వాతావరణ మార్పులను, జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను ఆర్టీజీఎస్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆర్టీజీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్‌లు తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించారు. వాతావరణంలో వస్తున్న మార్పులు, తుపాన్ కదలికలను అవేర్ విభాగం ఎప్పటికప్పుడు రియల్ టైమ్‌లో ట్రాక్ చేసి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రభావిత జిల్లాలకు చేరవేసేలా ఏర్పాట్లు చేశారు. ఏపీ ప్రాంతాల్లో తుపాను ప్రభావం ఎక్కువగా ఉండనుంది, రిజ్వర్వాయర్ల పరిస్థితి, వాటి క్యాచ్‌మెంటు ఏరియాల్లో ఎంత నీరు రావచ్చు తదితర వివరాలును జిల్లాలకు ఎప్పటికప్పుడు చేరవేసి అప్రమత్తం చేస్తున్నారు. తుఫాను కళింగపట్నం వద్ద తీరం దాటే సూచనలుండటంతో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం,అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల యంత్రాంగాన్ని ప్రత్యేకించి అప్రమత్తం చేశారు. శ్రీకాకుళంలో ఏపీ ప్రాంతంలో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశాలున్నాయో గుర్తించి ఆ జిల్లా యంత్రాంగాన్ని ముందుగానే అప్రమత్తం చేస్తున్నారు.



**అవేర్ ద్వారా అలెర్టుల జారీ..** అవేర్ విభాగం ద్వారా తుఫాను కదలికలు, దాని ప్రభావం గురించి ప్రజలకు వారి మొబైల్ ఫోన్లకు ఎప్పటికప్పుడు సమాచారం, హెచ్చరిక సందేశాలు పంపుతున్నారు. దీంతోపాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయిలో వరద సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది, స్వర్ణ వార్డు, స్వర్ణగ్రామ సచివాలయ అధికారుల వరకు కూడా ఎప్పటిక్పుడు తుపాను పరిస్థితులు, వర్షాలకు సంబంధించిన సమాచారాన్ని వారి మొబైల్‌ఫోన్లకు చేరవేస్తున్నారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో సహాయకచర్యలు చేపట్టడం సులభతరమయ్యేలా చేస్తున్నారు. ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈఓ డాక్టర్ ఎం మాధురి, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్లు పి. శ్రీఖర్, కె. చైతన్య, డి. అఖిల తదితరులు ఆయా జిల్లాల్లో పరిస్థితిని సమీక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు.

**రియల్ టైమ్‌లో వాతావరణ విశేషాలు..** ప్రజలు కూడా ఆర్టీజీఎస్ వారి అవేర్ వెబ్‌సైట్, యాప్ ద్వారా తామున్న చోటు నుంచే తమ మొబైల్ ఫోను ద్వారా రియల్ టైములో వాతావరణ విశేషాలు, తుపాను కదలికలను తెలుసుకోవచ్చని ఆర్టీజీఎస్ అధికారులు తెలిపారు. తుపాను ప్రభావం, వర్షాల తీవ్రతతో పాటు తమ ప్రాంతానికి సంబంధించిన వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు తామున్న చోటు నుంచే తెలుసుకోవచ్చు. దీనికోసం https://aware.ap.gov.in/dashboard వెబ్సైటును సందర్శించాలి లేదా అవేర్ యాప్‌ను డౌన్లోడు చేసుకోవడం ద్వారా తెలుసుకోవచ్చు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనాలు జరగాలి : డిజిపి

- ఖైరతాబాద్ గణనాధుని దర్శించుకున్న డిజిపి సివి ఆనంద్
- నిమజ్జనాల కోసం భారీ బందోబస్తు.. సమన్వయంతో ఏర్పాట్లు
- డీజేలు, బాణసంచాకు దూరంగా ఉండాలని ఉత్సవ కమిటీలకు సూచన



**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు డిజిపి సి.వి. తెలిపారు. గురువారం ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్న ఆయన.. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గణనాథుడి ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు.

**13 ఏళ్లుగా ఖైరతాబాద్‌తో అనుబంధం....** సెంట్రల్ జోన్ డీసీపీగా పనిచేసినప్పటి నుంచి ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలతో తనకు 13 ఏళ్ల అనుబంధం ఉందని డిజిపి గుర్తుచేశారు. సుదర్శన్ గారు , ఇప్పుడు వారి కొడుకులు సందీప్ మరియు రాజ్కుమార్ కూతురు వీణా, మహేష్ యాదవ్ ఇతర సభ్యులు వారందరూ శాంతియుతంగా నిమజ్జనాలు చెయ్యడానికి చాలా సహకరిస్తారని తెలియచేసారు.ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**30 వేల మంది పోలీసులతో బందోబస్తు ..** పది రోజుల గణేష్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయని డీజీపీ తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నిమజ్జనాలు జరుగుతున్నాయని, రేపు, ఎల్లుండి భారీ సంఖ్యలో నిమజ్జనాలు జరిగే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ సీపీలు, ఎస్పీలు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో సుమారు 30 వేల మంది పోలీసులను బందోబస్తు కోసం మోహరించినట్లు వెల్లడించారు.

**అన్ని శాఖల సమన్వయంతో ..** నిమజ్జనాల కోసం జీహెచ్ఎంసీ, విద్యుత్, జలవనరులు, ఇతర ప్రభుత్వ శాఖలతో పోలీసుశాఖ సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. హుస్సేన్‌సాగర్‌తో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. ట్యాంక్‌బండ్‌పై అవసరమైన చోట్ల క్రేన్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

**మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు..** నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో చోరీలు, మహిళల పట్ల వేధింపులు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు డిజిపి తెలిపారు. షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించామని, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు.

**డీజేలు, బాణసంచా వద్దు:** నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలు, బాణసంచా వినియోగంపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అమల్లో ఉన్నాయని డిజిపి గుర్తుచేశారు. అధిక శబ్దాలతో ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి డీజేలు, బాణసంచాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడం అభినందనీయమన్నారు.


### పాస్‌పోర్టు పోయినది

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ అర్బన్, మాచవరం, మలేరియా ఆఫీసు రోడ్డు, డోరు నెం.31-10-26, యం. స్వేర్ ఎన్‌క్లేవ్, 2వ ఫ్లోర్ కాపురస్తులు గేదల వెంకట సత్యనారాయణ గారి కుమారుడు గేదల దినేష్ అను ది.19-09-2026వ తేదీన గుణదల నుండి మచవరంలో మా ఇంటికి బైక్ మీద వెళుతుండగా మార్గమధ్యంలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. R2797405, విశాఖపట్నంలో ది.08-08-2017న జారీచేయబడిన పాసుపోర్టు పోయినది. వెంటనే పరిసర ప్రాంతంలో వెదకిననూ కనిపించలేదు. సదరు పాసుపోర్టును ఉపయోగించి, ఎవ్వరైనా ఎటువంటి అన్యాక్రాంతములు జరిపిన యెడల చట్టప్రకారం తీసుకునే యావత్తు చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేయుచూ, ఎవరికైనా ఒరిజినల్ పాసుపోర్టు దొరికినచో నాకు తెలియవరచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

సెల్ నెం. 9666643739



మహారాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, విజయవాడ

**OS.No. 2224/2023**

Between :
Union Bank of India, Seetharampuram Branch, Vijayawada ...వాది.
AND
Tumma Ramesh Babu. ...ప్రతివాది.
To,
1. **Tumma Ramesh Babu,** S/o. Rama Rao, D.No. 32-9-3, Coca Cola Street, Maruthinagar, Vijayawada - 520004, NTR Dist.

పై నెంబరు గల దావాలో ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తం **ది. 29-10-2026వ** తేదీన పై కోర్టువారు వాయిదా వేసినారు. కావున సదరు తేదీన మీరు గాని మీ తరఫున ప్లీడరు గారు గాని పైన తెలిపిన కోర్టు వారి ఎదుట **ది. 29-10-2026 వ తేదీ ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టులో హాజరై తగిన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున పై నెంబరు గల దావాలో విచారించగలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

**(By Order of the Hon'ble Court)**

ఇట్లు

**యం.డి. ప్రభాకర్, M.Com, LL.M.,** న్యాయవాది,
డి.నెం. 31-16-30, బుల్లెమ్మ వీధి, మాచవరం,
విజయవాడ - 520004. **ఫోన్ : 9290055959**
email : advdurgaprabhakar@gmail.com


## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- కంట్రోల్ రూమ్ నిర్వహణను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్
- అత్యవసర సమాచారాన్ని కంట్రోల్ రూమ్ 9154970454 కి అందించాలి



**విజయవాడ,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందేలా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలించి, వర్షాల పరిస్థితి, ప్రజల నుంచి ఇప్పటివరకు అందిన ఫిర్యాదులు, వాటిపై అధికారులు తీసుకున్న చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల స్వీకరణ, నమోదు, సంబంధిత శాఖలకు సమాచారం చేరవేయడం, వాటిపై తీసుకున్న చర్యలను పర్యవేక్షించడం వంటి అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులకు వెంటనే చేరవేసి, సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ నుంచి వైర్లెస్ సెట్ ద్వారా డివిజనల్ స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడి, జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి స్థాయిలో అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. జిల్లాలో నమోదవుతున్న వర్షపాత వివరాలను ప్రతి రెండు గంటలకు ఒకసారి క్రమం తప్పకుండా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో నమోదైన వర్షపాత వివరాలను సంబంధిత అధికారులకు, మీడియా ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. వర్షపాతానికి సంబంధించిన సమాచారంలో ఎలాంటి ఆలస్యం లేకుండా కంట్రోల్ రూమ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## వీఆర్ఏల సమ్మె.. అంబేద్కర్‌కు వినతి




**హనుమాన్ జంక్షన్,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బాపులపాడు మండలంలోని గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) చేపట్టిన సమ్మె బుధవారానికి 8వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వీఆర్ఏలు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ నిరసనను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం బాపులపాడు మండలంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వీఆర్ఏలు వినతిపత్రం సమర్పించారు. తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని కోరుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పరిష్కారం లభించలేదన్నారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు దశలవారీగా నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాపులపాడు మండలానికి చెందిన వీఆర్ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు.

## ముగిసిన మండల ప్రజా పరిషత్ సభ్యుల పదవీకాలం

-ఎంపీడీవో సిహెచ్ చిన్నరాట్నాలు



**విస్సన్నపేట,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** స్థానిక మండల ప్రజా పరిషత్ సభ్యుల పదవీకాలం ముగిసిందని ఐదు సంవత్సరాలు సంపూర్ణంగా సహకరించారని అందరికీ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రస్తుత ఎంపీపీ గద్దల మల్లయ్య, మొదటి టరం సేవలు అందించిన పీఎం వనజాక్షి రాజేష్ లు అభివృద్ధి పథంలో మండల ప్రజా పరిషత్ ను నడిపారన్నారు. రాబోయే కాలంలో మరి ఎన్నో పదవులు సాధించాలని కోరుకుంటున్నానని ఎంపీడీవో చెప్పారు. వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు ఓలేటి దుర్గారావు, గారపాటి నాగేశ్వరరావు, చాట్ల మణి, జి పాప, మేడ తిరుపతిరావు వి సత్యనారాయణ చారి, ఆప్షన్ నెంబర్ జాఫర్ బాబా తదితరులును పట్టు శాలువాలతో సుగంధ పరిమళాలు వెదజల్లే పూలదండలతో సన్మానించారు. ఇదే కార్యక్రమంలో ఎంపీటీసీలు అందరూ కలిసి ఎంపీడీవోను ఘనంగా సన్మానించారు. డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ పాల్గొన్నారు.

## పెద్ద అవుటపల్లి లో ఉద్రిక్తత..

● వినాయక ఊరేగింపులో కుల ఘర్షణ.. ఇద్దరికి తీవ్ర గాయాలు




**గన్నవరం,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం పెద్దఅవుటుపల్లిలో వినాయక విగ్రహ ఊరేగింపు సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాత కక్షలు, కుల విభేదాల నేపథ్యంలో ఊరేగింపు సమయంలో కావాలనే గొడవకు దిగి, కుల దూషణలు చేస్తూ తీవ్రంగా కొట్టినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ దాడిలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. బాధితులు, వారి బంధువులు ఆత్కూరు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. పోలీసులు తగిన విధంగా స్పందించడం లేదని, దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకున్నా మళ్లీ వదిలేశారని ఆరోపిస్తూ స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. వర్షిత్, సాయి గౌడ్, కనక రావు, వెంకట్, నిందితులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు, బంధువులు డిమాండ్ చేశారు.

## మచ్చలేని వ్యక్తిత్వం కలిగిన కాగితపై పేర్ని అసత్య ఆరోపణలు...

● ఖండించిన శలపాటి,శీరం



**పెడన,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పై మాజీ మంత్రి పేర్ని నాని చేసిన అసత్య ఆరోపణలను మండల టిడిపి అధ్యక్షుడు శలపాటి ప్రసాద్ మండల ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్ లు ఒక పత్రికా ప్రకటనలో ఖండించారు. గత మూడు రోజుల క్రితం పెడనలో వైసిపి సమావేశం జరిగిన నేపథ్యంలో పేర్ని నాని కాగిత పై పలు విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. ఈ విమర్శలను టిడిపికి చెందిన పలువురు నాయకులు ఖండించారు. ఏ నియోజకవర్గానికి వెళితే అక్కడి టిడిపి నాయకులపై అసత్య ఆరోపణలు చేయడం పేర్ని నానికి అలవాటుగా మారిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పేర్ని ఇలాంటి విమర్శలు చేస్తున్నారని చెప్పారు. వైసిపి నాయకులు ఎన్ని కుప్పిగంతులు వేసినా ఎన్నికల్లో విజయం కూటమి పార్టీలదేనని ధీమా వ్యక్తం చేశారు. మచ్చ లేని వ్యక్తిత్వం కలిగిన కృష్ణ ప్రసాద్ పై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని వైసీపీ నాయకులను శలపాటి శీరం హెచ్చరించారు

# ఘనంగా 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకలు

● ధన్వంతరి హోమం నిర్వహణ సిసిఆర్ఎసి -- స్పార్క్ స్కాలర్‌షిప్ చెక్కుల పంపిణీ

● ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డులు



**విజయవాడ,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ డా.ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం మరియు ఆయుర్వేద వైద్య విధాన అభివృద్ధిని ఆకాంక్షిస్తూ శ్రీ ధన్వంతరి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయుష్ శాఖ డైరెక్టర్ గోపాలకృష్ణ రొణంకి, అదనపు డైరెక్టర్ డా.పి.సాయి సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ జె.ధనుంజయరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిసిఆర్ఎసి -- స్పార్క్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన యూజి విద్యార్థులు, పిజి స్కాలర్లకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. అలాగే జాతీయ ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలు, కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, బహుమతులు అందజేశారు. ఈ వేడుకలు ఆయుర్వేద విద్య, పరిశోధన, వైద్య సేవలు మరియు ప్రజల్లో ఆయుర్వేదంపై అవగాహన పెంపొందించడంలో డా.ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల యొక్క నిబద్ధతను ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమాన్ని డా. ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డా.టి.బుల్లయ్య, డా. ఏ.ఎల్. ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.పి.జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పిజి స్కాలర్లు, ఇంటర్న్‌లు, ఆసుపత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పి.ఆర్.టి.యు. మండల నూతన కార్యవర్గ ఎన్నిక



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో పి.ఆర్.టి.యు పెనుగంచిప్రోలు మండల శాఖ అధ్యక్షుడు చాట్ల.నిరంజన్ అధ్యక్షతన బుధవారం పి.ఆర్.టి.యు సభ్యులకు సమావేశం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గడ్డం.నారాయణరావు , ఎన్టీఆర్ జిల్లాఅధ్యక్షులు షేక్.నవాబ్ జానీ , రాష్ట్ర మాజీ అసోసియేట్ అధ్యక్షుడు ఆవుల రాంబాబు ముఖ్య అతిధులుగాహాజరై న్నారు, మండల కార్యవర్గ సమావేశములో, మండల నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించడం జరిగినది. మండల అధ్యక్షుడిగా మండలంలోని ముచ్చింతాల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చల. సునీల్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శిగా, కొనకంచి ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ గా పనిచేయుచున్న కోతాటి. నరేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగినది. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన గడ్డం. నారాయణరావు మాట్లాడుతూ,ఇటీవల ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒకే సారి రెండు పెండింగ్ డి.ఎ లు ప్రకటించటం హర్షనీయమనీ, అదే సమయంలో ఉపాధ్యాయులు పలు ఆప్ సంభందించిన సమస్యలు ఎదుర్కోవటం జరుగుతుందని, ఉపాధ్యాయులు సెలవు పెట్టినపుడు మధ్యాహ్న భోజనానికి సంబందించి ఫీడ్ బ్యాక్ ఇవ్వమనటం తదితర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మర్రి.ప్రభాకర్, జిల్లా నాయకులు సిహెచ్.బ్రహ్మయ్య, షేక్. కరీముల్లా,, ఇస్లావత్.పుల్లయ్య, ఉప్పు.వెంకట్రావు, చంద్రమౌళేశ్వరావు, షేక్. ఆదం షఫీ, సిహెచ్.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు...

# డైరెక్టర్ గా అమరేంద్రకుమార్ నియామకంతో అభివృద్ధి పదంలో పశు సంవర్ధక శాఖ....

● అభినందనలు తెలిపిన నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కృష్ణాజిల్లా కమిటీ



**పెడన,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** రాష్ట్ర యానిమల్ హస్బెండరీ (పశు సంవర్ధక శాఖ )డైరెక్టర్ గా ఆర్ అమరేంద్రకుమార్ నియమితులయిన నేపథ్యంలో ఈ విభాగం అభివృద్ధి పథంలో పయనించనుందని నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కృష్ణా జిల్లా శాఖ ఒక ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేసింది.అమరేంద్ర కుమార్ నియామకానికి సంబంధించి ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయమని అన్నారు.ఇప్పటివరకు ఆయన షీప్ అండ్ గోట్ కోపరేటివ్ డెవలప్మెంట్ ఫెడరేషన్ లిమిటెడ్ కు మేనేజింగ్ డైరెక్టర్ గా పనిచేశారు. ఇకపై ఆయన పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గా పూర్తి అదనపు బాధ్యతలతో పని చేయనున్నారు. అమరేంద్రకుమార్ నియామకం పట్ల నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ జె వి ఓ అండ్ వి ఎల్ ఓ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆత్కూరి రమేష్ బాబు (గ్రామీణ పశుగణన కేంద్రం గుండుపాలెం) జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ముక్కు వీరబాబు (గ్రామీణ పశు గణన కేంద్రం వెనుతురుమిల్లి ) పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ వి వి రామారావు హర్షం ప్రకటించారు. ఆయన హయాములో పశు పోషకులు దినదినాభివృద్ధి చెందగలరన్న ఆశ భావాన్ని వ్యక్తం చేశారు.

# పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండ: ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



**కాకినాడ,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, పేద ప్రజలను సొంత కుటుంబ సభ్యులుగా భావించి, ఆపద సమయంలో అండగా నిలిచి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు.బుధవారం ఎమ్మెల్యే స్వగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో కాకినాడ సిటీ నియోజకవర్గం స్థానిక 18వ డివిజన్ కి చెందిన గాదం మధుసూదన్ రావు కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన సుమారు రూ.5,03,071ల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పేద ప్రజలను సొంత కుటుంబ సభ్యులుగా భావించి, ఆపద సమయంలో అండగా నిలుస్తుందని, ఏ కుటుంబానికైనా అనారోగ్య సమస్య వచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదురైతే, ప్రభుత్వ సహాయాన్ని అందేలా చేసి ప్రతి కుటుంబానికి అండగా నిలబడడం జరుగుతుందని పేర్కొన్నారు.బాధిత కుటుంబ సభ్యులు గాదం మధుసూదన్ రావు మాట్లాడుతూ సీఎం సహాయనిధి ద్వారా తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిన చంద్రబాబు నాయుడుకి,కూటమి ప్రభుత్వానికి,తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జి బొడ్డు శివాజీ,మేరేటి బ్రహ్మస్వామి, పినపోతు శివ, సింహాద్రి, నరసింహస్వామి, మోస తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

# "పదవులు ముగిసినా.. ప్రజాసేవ కొనసాగాలి" - బాపులపాడులో ఎంపీటీసీలకు ఘన సన్మానం



**హనుమాన్ జంక్షన్,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** రాష్ట్రవ్యాప్తంగా ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవుల పదవీకాలం బుధవారంతో ముగిసిన సందర్భంగా బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంలో అభినందన సభను ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షుడు యరగొర్ల నగేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీడీవో తోట తిరుమల త్రినాథరావు అధ్యక్షత వహించారు. మండలంలోని ఎంపీటీసీలందరినీ ఆహ్వానించి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. గత ఐదేళ్లుగా మండల అభివృద్ధికి వారు అందించిన సేవలను వక్తలు కొనియాడారు. జెడ్పీటీసీ కొమరవల్లి గంగాభవాని, వైస్ ఎంపీపీలు పండు రాణి, చందు రమాదేవి తదితరులు తమ సందేశాలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నగేష్ మాట్లాడుతూ.. పదవీకాలం ముగిసినా ప్రజా సేవను కొనసాగించాలని ఆకాంక్షించారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ తమకు అండగా నిలిచి అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ప్రతి ఎంపీటీసీని పేరు పేరునా పిలిచి కుటుంబ సభ్యులతో కలిసి సన్మానించారు. జెడ్పీటీసీ కొమరవల్లి గంగాభవాని, వైస్ ఎంపీపీలు పండు రాణి, చందు రమాదేవి దంపతులను కూడా ఘనంగా సన్మానించారు. కార్యక్రమ నిర్వాహకుడు ఎంపీపీ యరగొర్ల నగేష్ దంపతులను ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, అధికారులు, స్నేహితులు, అభిమానులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచులు, మండల అధికారులు, సిబ్బంది, ఎంపీటీసీలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ నగేష్ ఏర్పాటు చేసిన విందు భోజనంలో ఎంపీటీసీలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# "అవినీతి అధికారికి అందలమా? - సామాజికవేత్త కొల్లూరు వెంకటేశ్వరరావు



**విజయవాడ,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** సామాజిక, వ్యాపారవేత్త, న్యాయవాది కొల్లూరు వెంకటేశ్వరరావు (పల్లవి కార్ ట్రావెల్స్ ప్రొప్రైటర్) విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖలో అవినీతి అధికారికి అందలమా ఆరోపించారు. తనకు 20 ఏళ్లుగా ట్రావెల్స్ ఉందని, ప్రభుత్వ అనుమతితో వి ఐ పి లకు కార్లు ఇస్తానని తెలిపారు. 2016లో కాపు కార్పొరేషన్ ఏం.డి. రెడ్డం అమరేంద్ర కుమార్ పి.ఏ.రవి కిరణ్ తనకు ఫోన్ చేసి ఏడాది కార్ కాంట్రాక్ట్ అడిగారన్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం కారు ఇచ్చాక బిల్లుల విషయంలో ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. కార్పొరేషన్‌లో రవి కిరణ్, నరేంద్ర అనే ఇద్దరికి ఫేక్ విద్యా సర్టిఫికెట్లతో ఉద్యోగాలు ఇప్పించారని అదే విధంగా విదేశీ విద్యా లోన్లు, ఉద్యోగాల నియామకాల్లో కమిషన్లు వసూలు చేశారని ఆరోపించారు. తన కారు బిల్లు రూ. 3 లక్షలు పెండింగ్‌లో ఉందని, అడిగితే దౌర్జన్యంగా మాట్లాడేవారని చెప్పారు. ఆయనపై ఎంక్వయిరీ రాగానే రాజకీయ పలుకుబడితో కాకినాడ వెళ్లారని ఆరోపించారు. తర్వాత ఆ అధికారి పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు అటెండర్ల భార్యలకు అర్హత లేకుండా ఉద్యోగాలు ఇచ్చారన్నారు. అంబులెన్స్, ఫ్రిజ్‌ల కొనుగోలులో కోట్లలో కమిషన్లు తీసుకున్నారని ఆరోపించారు. రవి కిరణ్, నరేంద్ర, లేపాక్షి హరిగోపాల్ తన బినామీలని, వారి ద్వారా వసూళ్లు చేస్తారని కొల్లూరు ఆరోపించారు. పశుసంవర్ధక శాఖలో రూ. 50-100 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ఏడాది సెలవు తీసుకుని ఐ. ఏ .ఎస్.ప్రిపరేషన్ పేరుతో గుంటూరులో ఏపీ షిప్ & గాట్ ఫెడరేషన్ ఏం.డి. అయ్యారన్నారు. తన కుమారుడు కొల్లూరు వెంకట నాగేశ్వరరావు ద్వారా 11 నెలలకు ఇన్నోవా క్రిస్టా కారును నెలకు రూ.60 వేలకు ఒప్పుకుని, రూ.95 వేలు బిల్లు చేశారని ఆరోపించారు. తన బంధువుకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం కోసం రూ.5 లక్షలు తీసుకుని ఉద్యోగం ఇవ్వలేదని కొల్లూరు ఆరోపించారు. అడిగితే కుల దూషణ చేసి కారు ఒప్పందాన్ని రద్దు చేశారని, తాను ఫైనాన్స్‌లో ఇబ్బంది పడ్డానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సీఎం చంద్రబాబు నాయుడు కి లేఖ రాయగా, సీఎంఓ నుండి విజయవాడ పోలీస్ కమిషనర్‌కు వచ్చిందని ఎఫ్.ఐ. ఏ.ఆర్ నమోదైందని తెలిపారు. పోలీసులను కూడా 'నేను ఐఏఎస్ ని' అని బెదిరించారని కొల్లూరు ఆరోపించారు. ఆయనకు గొల్లపూడిలో బినామీ ఆస్తులు, అక్రమ సంబంధాలు ఉన్నాయన్నారు. మొత్తం అవినీతి రూ.200 కోట్ల వరకు ఉంటుందని, సీఎంఓ స్థాయి అధికారులతో విచారణ జరిపి రికవరీ చేయాలని ఆయన కోరారు. తనకు రావాల్సిన రూ.35 లక్షల బిల్లు, ఉద్యోగం కోసం ఇచ్చిన డబ్బును ఇప్పించాలని, అధికారిని సస్పెండ్ చేయాలని సీఎంను కోరుకుంటూ, తన వద్ద పూర్తి సాక్షాలు, ఆధారాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలంటూ వీఆర్ఏల ఆందోళన




**పెడన,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** తమ డిమాండ్ల సాధన కోసం గ్రామ రెవెన్యూ సహాయకులు చేస్తున్న ఆందోళన ఉధృతంగా సాగుతుంది. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద గత నాలుగు రోజులుగా వీఆర్ఏలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తమకు విఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని వారు కోరుతున్నారు. పే స్కేలు అమలు చేయడంతో పాటు నామినీలుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని కూడా వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. తమ కోర్కెలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని

## ప్రతి ఒక్కరూ అప్రమత్తం వహించాలి

మండల రెవెన్యూ అధికారిణి కే లక్ష్మీ కళ్యాణి




**విస్సన్నపేట,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** స్థానిక మండల పరిధిలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వాతావరణంలో జరుగుతున్న మార్పులను అనుసరిస్తూ చెరువులు కాలువలు వాగుల నీటి తీరు పరిశీలించామని ఎమ్మార్వో కే లక్ష్మీ కళ్యాణి మీడియా సమావేశంలో తెలియజేశారు. వర్షాలు తగ్గేవరకు విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని మొండి మట్టి గోడలు ఉన్న పురాతన ఇండ్లలో నివాసాలు ఉండవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. పరిసర ప్రాంత నివాసాలలో చెట్లు పడిపోయిన తమకు తెలియజేయాలని రెవెన్యూ పోలీస్ పంచాయతీరాజ్ అన్ని శాఖల నుండి సహాయ సహకారాలు అందించేందుకు ఎనీ టైం అందుబాటులో ఉంటామన్నారు.

## భక్తుల కానుకల లెక్కింపులో పాల్గొన్న ఆలయ చైర్మన్ టి శ్రీనివాసరావు



**విస్సన్నపేట,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని పుట్రేల మారెమ్మ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమంలో చైర్మన్ టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆయనతోపాటు దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఈవో వీడిని ప్రసాద్ రెవెన్యూ మరియు పోలీస్ సిబ్బంది హాజరయ్యారు.

## అన్నదానం కు ఒక లక్ష నూట పదహారు రూపాయలు విరాళం



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో జరుగు అన్నదానం కు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరం కొత్తపేట సత్యా నగర్ కాలనీ వాస్తవ్యులు గుంజి శ్రీనివాసరావు వారి సతీమణి కీర్తిశేషులు కొండిరత్నం జ్ఞాపకార్థం శ్రీ అమ్మవారి నిత్య అన్నదాన పథకమునకు 1,00,116 రూపాయలు విరాళము గా ఆలయ చైర్మన్ చుంచు రమేష్ బాబు మరియు ఆలయ ప్రధాన పూజారి మర్రే బోయిన గోపి బాబు, ధర్మకర్తలు గుగులోతు రమేష్ గజ్జి పెద్ద ఆంజనేయులు సమక్షంలో అందజేశారు, వారికి ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థప్రసాదములు అందజేసినారు....

## ఆరోగ్యకర జీవితమే అమృతం - డాక్టర్ అలేఖ్య....



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లో తొమ్మిదవ పోషణ మాహ్ - 2026 సందర్భంగా బుధవారం కొనకంచి గ్రామంలో భీమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అలేఖ్య ఆరోగ్యం అమృతం జీవితం అని ప్రతి ఒక్కరూ తాజా వేడి పోషకమైన భోజనం తీసుకోవాలని, ఆ భోజనంలో చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, సీజనల్ కూరగాయలు ,పండ్లు ,మునగఆకు తీసుకోవాలని ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే ఆరోగ్యకరమైన కుటుంబాలు ఉంటాయని, పిల్లలకు సంవత్సరం నిండే సరికి పెద్దవారు తినే ఆహారం తినేటట్లు వారికి అలవాటు చేయాలని ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ హరిత, ఏఎన్ఎం సరళ, ఆశాలు మస్తానమ్మ, మణి ,అంగన్వాడి కార్యకర్తలు బి లక్ష్మి, లక్ష్మికుమారి , నారాయణమ్మ, నాగరాజు కుమారి మరియు గర్భిణీలు, బాలింతలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు...

# బౌరంపేట్‌లో గణనాథుడికి ఘన వీడ్కోలు

**ఆకాశం నుంచి కురిసిన పూలవర్షం నడుమ సాగిన నిమజ్జన శోభాయాత్ర**
**హాజరైన బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు**



**దుండిగల్ సెప్టెంబర్ 23, (వార్తాప్రభ)** : నవరాత్రులు విశేష పూజలందుకున్న గణనాథుడికి దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్‌లో భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బౌరంపేట్ బొడ్రాయి వద్ద నిర్వహించిన నిమజ్జన వీడ్కోలు కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శోభాయాత్ర ప్రారంభం సందర్భంగా ఆకాశం నుంచి ప్రత్యేకంగా పూలవర్షం కురిపించారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి యాత్రను ముందుకు సాగించారు. 'అగ్లీ బార్ జల్దీ ఆనా' అంటూ భక్తులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ స్వామివారిని సాగనంపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సరుగారి ధర్మారెడ్డితో పాటు స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కాలనీ ప్రముఖులు, బౌరంపేట్ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గన్నవరం లో వైభవంగా గణేష్ నిమజ్జనాలు

**గన్నవరంలో 28 కేజీల లడ్డును రూ. 1.50 లక్షలకు దక్కించుకున్న మోర్ల వంశీ**



**గన్నవరం,సెప్టెంబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుడి నిమజ్జనాలు వైభవంగా బుధవారం జరిగాయి. విజేత టైలర్స్ సెంటర్ లో శ్రీ విఘ్నేశ్వర కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 28వ సంవత్సరం ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద 28 కేజీల లడ్డును వేలం పాటలో గన్నవరం కు చెందిన మెర్ల వంశీ రూ. 1.50 లక్షలకు దక్కించుకున్నారు. రెండువేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. గత తొమ్మిది రోజులుగా గణేష్ నవరాత్రి మహోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో వినాయకుడిని కూర్చోబెట్టి తీన్మార్ డబ్బులు, కోలాటం, మేళ తాళాలతో పలు వీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఏలూరు కాలవలో నిమజ్జనం చేశారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కమిటీ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జే .మల్లికార్జునరావు, వై ఈశ్వరరావు, ఎం రాంబాబు, జి సుబ్బారావు, బి శేషగిరి.భక్తులు, యువకులు, మహిళలు,తదితరులు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శరవేగంగా శ్రీ కొండలమ్మ ఆలయాభివద్ధి....

**- రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రశంసలు..**
**- చైర్మన్ మోహన్‌ను ప్రోత్సహించిన మంత్రి ఆనం....**



**గుడ్లవల్లేరు:సెప్టెంబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయాభివద్ధి శరవేగంగా జరుగుతుందని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రశంసించారు. బుధవారం దేవాదాయ మంత్రి ఆనంను ఆ దేవస్థాన చైర్మన్ ఈడే మోహన్‌తో పాటు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొడాలి రామరాజు మర్యాద పూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేశారు. చైర్మన్ మోహన్ తమ ధర్మకర్తలతో కలిసి చేస్తున్న ఆలయాభివద్ధిపై మంత్రి ఆనం ప్రోత్సహించారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రోత్సాహంతో చేస్తున్న ఆలయాభివద్ధిని మంత్రి ప్రశంసించారు. తమ ఆలయాన్ని మరింత అభివద్ధి చేసేందుకు తమకు నిధులను కేటాయించాలని మంత్రి ఆనంను చైర్మన్ మోహన్, రామరాజు కోరారు.

# హాజీ సర్వర్ 351వ జయంతి వేడుకలు....



**గుడ్లవల్లేరు:సెప్టెంబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలంలోని ఉలవలపూడిలో తానీషా ప్రభువు హయాంలో దర్గా నిర్మించిన గురువు 'సయ్యద్ హాజీ సర్వర్ సయ్యా' 351వ జయంతి ఉత్సవాల వేడుకలను బుధవారం నిర్వహించారు. జోరువానలో సైతం ఈ వేడుకల్లో అధికసంఖ్యలో ముస్లింలు, భక్తులు పాల్గొన్నారు. హాజీ సర్వర్ జీవ సమాధి వద్ద ముస్లిం మహిళలు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నసమారాధనను చేపట్టారు. వర్షంలో సైతం అధికసంఖ్యలో విచ్చేసి హాజీ సర్వర్ బాబా వారి అన్న ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో దర్గా ముజీవర్(గురువు) కుదరతుల్లా షరీఫ్, దర్గా కమిటీ మెంబర్ మహ్మద్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

# బౌరంపేట్‌లో ఉచిత ఆయుష్మాన్ ఆరోగ్య శిబిరం

**సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో వైద్య సేవలు**
**ఆయుర్వేదం, హోమియోపతితో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం. - ఎస్. మల్లారెడ్డి**











**దుండిగల్, సెప్టెంబర్ 23, (వార్తాప్రభ)** : సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్ వార్డు కార్యాలయ ఆవరణలో 295వ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో ఉచిత ఆయుష్మాన్ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ ఆయుష్ విభాగం వైద్యుల సహకారంతో "ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం" అనే నినాదంతో ఈ మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ డాక్టర్ ఎస్. మల్లారెడ్డి మాట్లాడారు. యోగా, ఆయుర్వేదం, హోమియోపతి వైద్య పద్ధతుల ద్వారా అనేక దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతీయ సాంప్రదాయ వైద్య విధానాలకు పెద్దపీట వేస్తూ యోగా, ఆయుర్వేదాన్ని ప్రజలకు చేరువ చేశారని గుర్తుచేశారు. చిన్నపాటి అనారోగ్య సమస్యలకు సైతం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థిక ఇబ్బందులు కొనితెచ్చుకోకుండా, స్థానికంగా అందుబాటులో ఉన్న ఆయుర్వేద, హోమియో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. డివిజన్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, చిన్నపాటి ఆరోగ్య సమస్యలకే భారీగా ఖర్చు చేసే ధోరణి తగ్గాలని, ప్రైవేటు ఆసుపత్రుల ఆర్థిక భారం నుంచి బయటపడటానికి ప్రకృతి సిద్ధమైన హోమియో, ఆయుర్వేద వైద్యం ఉత్తమ ప్రత్యామ్నాయమని తెలిపారు. స్థానికంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో అందుతున్న ఈ నాణ్యమైన సేవలను ప్రజలంతా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొమ్ము మంగమ్మ, మాజీ ఎంపీటీసీ ఎస్. జంగారెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ బి. కళావతి, డాక్టర్ పట్లోళ్ల రాజ్ మోహన్, ఫార్మసిస్ట్ భాగ్యలక్ష్మి, శ్రమ శక్తి పురస్కార గ్రహీత మరియు విశ్రాంత సీనియర్ రైల్వే ఉద్యోగి ఆర్వీఎస్ రాఘవరావు పాల్గొన్నారు. అలాగే బీజేపీ సీనియర్ నాయకులు గోనె మల్లారెడ్డి, దమ్మగారి ప్రభాకర్ రెడ్డి, డి. సీతారాంరెడ్డి, ఆకుల సత్యనారాయణ, కమ్మరి రమేష్ చారి, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు ఎం. వెంకటేష్ నాయక్, ఎం. జంగారెడ్డి, బహదూర్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఏ. శ్రీనివాస్ యాదవ్, దుండిగల్ డివిజన్ అధ్యక్షుడు ఆకుల విజయ్, కొమ్ము ప్రశాంత్, తలారి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేశాం

**● ఐదేళ్లలో రూ.3.50 కోట్లతో మండలం అభివృద్ధి ● పల్లె పండుగ 2.0 కింద మంజూరైన నిధులకు అదనంగా మండల పరిషత్ నిధులు కేటాయిం చాం ● హిందూ శ్మశాన వాటికకు స్థలం కోసం ఎంతో ప్రయత్నించాము ● మరొకసారి అవకాశం వస్తే ప్రజలందరి ఆశీస్సు లు ఉండాలని కోరుకుంటున్నాను.... ● -జి.కొండూరు ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ**



**జి.కొండూరు:సెప్టెంబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండల ప్రజలు,అధికారులు, జి.కొండూరు మండల పరిషత్ పాలకవర్గం సభ్యుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేశానని స్థానిక మండల పరిషత్ అధ్యక్షురాలు వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధి గురించి ప్రస్తావించారు.మండల ప్రజలందరి ఆశీస్సులతో చిన్న వయస్సులోనే మండల పరిషత్ అధ్యక్షురా లిగా (వీరా) బాధ్యతలు స్వీకరించి,ఈ రోజుతో ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని విజయవంతం గా పూర్తి చేసుకున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.ఈ ఐదేళ్ల కాలంలో మండల పరిషత్ నిధులు సుమారు రూ.3.50 కోట్లతో గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు.గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు.పల్లె పండుగ కార్యక్రమాల కింద కూడా మ్యాచింగ్ గ్రాంట్ అందించి అభివృద్ధి పనులకు తన వంతు సహకారం అందించినట్లు ఎంపీపీ పేర్కొన్నారు. మండల పరిషత్ నిధులు కేటాయించి మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనానికి , అలాగే మండల ప్రజా పరిషత్ కమ్యూనిటీ హాల్ కు మరమ్మత్తులు చేయించి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించినట్లు ఎంపీపీ తెలిపారు.

**హిందూ శ్మశాన వాటికకు స్థలం కోసం ఎంతగానో ప్రయత్నించాము:**

జి.కొండూరు గ్రామంలో హిందూ శ్మశాన వాటికకు అవసరమైన స్థలం కోసం ఎంతగానో కృషి చేశామన్నారు.బరియల్ గ్రౌండ్ ఉన్నప్పటికీ ప్రస్తుతం జిల్లా పరిషత్ స్థలంలోనే దహనసంస్కారలు జరుపుకోవడం జరుగు తుందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న రీ-సర్వే ద్వారా జిల్లా పరిషత్ స్థలాన్ని గుర్తించి,ఆ స్థలంలో హిందూ స్మశాన వాటిక ఎంత మేర ఉందో ఆ స్థలానికి సరిపోయేలా బరియల్ గ్రౌండ్ స్థలాన్ని కేటాయించే అవకాశం ఉందని,ఇది కలెక్టర్ వల్లే సాధ్యపడుతుందని ఎంపీపీ తెలియ జేశారు.స్మశాన వాటికకు వెళ్లేందుకు పులి వాగు పై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేయటం సంతోషించదగ్గ విషయమని అన్నారు.తన ఐదేళ్ల పదవీకాలంలో సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, ప్రజలకు ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ కృతజ్ఞతలు తెలియజేశారు.భవిష్యత్తులో కూడా తన బాధ్యతలను ఇదే విధంగా కొనసాగిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆమె స్పష్టంచేశారు.మరొకసారి అవకాశం వస్తే ప్రజలందరి ఆశీస్సు లు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.



ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ, జి కొండూరు

# పాఠశాల బస్సు డ్రైవర్లు నిబద్ధతతో విధులు నిర్వహించాలి

**విద్యార్థుల భద్రత డ్రైవర్లపై ఉన్న అత్యంత కీలక బాధ్యత**
**డ్రైవర్లు విధిగా యూనిఫామ్ ధరించాలి**
**డ్రైవింగ్ నైపుణ్యంతో పాటు మంచి ప్రవర్తన, వాహన నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలి**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**





**విజయవాడ: సెప్టెంబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పాఠశాల విద్యార్థులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడంలో పాఠశాల బస్సు డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ డ్రైవర్లు నిబద్ధతతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. విజయవాడ బెంజ్ సర్కిల్‌లోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల బస్సు డ్రైవర్లకు డ్రైవింగ్ మెళకువలు, రహదారి భద్రత, విద్యార్థుల సురక్షిత ప్రయాణం తదితర అంశాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ పాఠశాల బస్సు డ్రైవర్లు విధిగా యూనిఫామ్ ధరించాలని తెలిపారు. యూనిఫామ్‌లో ఉన్న డ్రైవర్లను చూడటం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు భద్రతపై మరింత నమ్మకం, భరోసా కలుగుతుందని అన్నారు. పాఠశాల బస్సుల్లో ప్రయాణించే విద్యార్థుల భద్రత ప్రధానంగా డ్రైవర్ల బాధ్యతపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ బాధ్యతను ప్రతి డ్రైవర్ అత్యంత జాగ్రత్తగా, నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. డ్రైవర్లు కేవలం డ్రైవింగ్‌లో నైపుణ్యం కలిగి ఉండటం మాత్రమే కాకుండా సహనం, సమయపాలన, మంచి ప్రవర్తన, బాధ్యతాయుత వైఖరి, వాహన నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులను తీసుకెళ్లే సమయంలో రహదారి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వాహనాన్ని అత్యంత అప్రమత్తంగా నడపాలని తెలిపారు. డ్రైవింగ్‌లో ఎప్పటికప్పుడు తాజా మెళకువలను నేర్చుకుంటూ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని డ్రైవర్లకు సూచించారు. విద్యార్థుల సురక్షిత రవాణా విషయంలో పాఠశాల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. పాఠశాల బస్సులు, టాక్సీలు నడిపే డ్రైవర్లకు ఎప్పటికప్పుడు అవసరమైన శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రైవర్లు కూడా మేలైన డ్రైవింగ్ పద్ధతులు, రహదారి భద్రతా చర్యలు, వాహనాల నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై పరస్పరం చర్చించుకుని తమ అనుభవాలను పంచుకోవాలని అన్నారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణం కోసం పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లు, రవాణా శాఖ, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థుల భద్రతకు సంబంధించి డ్రైవర్లకు అవసరమైన సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అందిస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాఠశాల బస్సు డ్రైవర్లకు సురక్షిత డ్రైవింగ్ పద్ధతులు, రహదారి భద్రతా నియమాలు, వాహన నిర్వహణ, విద్యార్థుల పట్ల బాధ్యతాయుత ప్రవర్తన తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి ఎం.పురేంద్ర, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, రవాణా శాఖ అధికారులు, సిబ్బంది, పాఠశాల బస్సు, టాక్సీ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో గణేష్ లడ్డు వేలం పాట

**రూ. 74 వేలు పలికిన 21 కేజీల మహా లడ్డు**
**చిన్న లడ్డును రూ. 40 వేలకు దక్కించుకున్న స్వామి సాయి విఘ్నేష్**



**జీడిమెట్ల, సెప్టెంబర్ 23, (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కొలువుదీరిన విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి లడ్డు ప్రసాదం వేలం పాట భక్తుల ఉత్సాహం నడుమ పోటాపోటీగా సాగింది. ఈ వేలం పాటలో 21 కేజీల ప్రధాన లడ్డు ప్రసాదాన్ని నారాయణస్వామి డెబ్బై నాలుగు వేల రూపాయలకు (రూ. 74,000) వేలంలో దక్కించుకున్నారు. అలాగే చిన్న లడ్డును తుమ్మ అశోక్, లహరి దంపతుల కుమారుడు తుమ్మ స్వామి సాయి విఘ్నేష్ నలభై వేల రూపాయలకు (రూ. 40,000) సొంతం చేసుకున్నాడు. స్వామివారి ప్రసాదాన్ని దక్కించుకున్న భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి వేడుకలు సాంప్రదాయాలు, సాంస్కృతికి ప్రతీకలు

**-బిజెపి ఇన్చార్జ్ ఉదయ్ కుమార్ యాదవ్**



**శేరిలింగంపల్లి,సెప్టెంబరు 23 (వార్తాప్రభ):**గణేశ్ నవరాత్రి వేడుకలు సంప్రదాయాలు, సంస్కృతికి ప్రతీకలుగా నిలుస్తూ సమాజంలో ఐక్యత, స్నేహభావాలను పెంపొందిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ అన్నారు. గచ్చిబౌలి డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో బుధవారం ఆయన,మాజీ కార్పొరేటర్ వి. గంగాధర్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం నిర్వాహకులు వారిని సన్మానించారు.ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి కృపాకటాక్షాలు భక్తులందరిపై ఉండాలని ఆకాంక్షించారు.వినాయక చవితి ఉత్సవాలు చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకలని పేర్కొన్నారు.గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్సవాలతో పాటు పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

# క్రీడలకు సంపూర్ణ సహకారం అందిస్తా

**మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 23(వార్తా ప్రభ ప్రతినిధి):** మైలవరం నియోజకవర్గంలోని యువత క్రీడల్లో ప్రతిభను చాటేందుకు అవసరమైన సహకారం అందిస్తానని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి నియోజకవర్గానికి గుర్తింపు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం వేదికగా స్కై ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్ ముగింపు సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని ముత్తవరపు కళ్యాణ మండపంలో బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.టోర్నమెంట్‌లో విజయవాడ--తాడేపల్లికి చెందిన సులోచన సీసీ జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. సత్య స్టార్స్ జట్టు రన్నర్స్‌గా రెండో స్థానాన్ని, అమ్మ క్యాటర్స్ జట్టు మూడో స్థానాన్ని సాధించింది.టోర్నమెంట్‌లో మొదటి బహుమతిని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ స్పాన్సర్ చేశారు. విజేత సులోచన సీసీ జట్టుకు రూ.50 వేల నగదు, ట్రోఫీ, రన్నర్స్‌గా నిలిచిన సత్య స్టార్స్ జట్టుకు రూ.25 వేల నగదు, ట్రోఫీ, మూడో స్థానంలో నిలిచిన అమ్మ క్యాటర్స్ జట్టుకు రూ.10 వేల నగదు, ట్రోఫీలను ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడా పోటీలను ప్రోత్సహిస్తూ యువతకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారిని నిర్వాహకులు, క్రీడాకారులు అభినందించారు.

# సంపాదకీయం

## ఎల్-నినో అంటే ఏంటి? ప్రపంచంపై ఎలాంటి ప్రభావం చూపిస్తుంది?

వాతావరణంలో మార్పులు వచ్చినప్పుడు తరచుగా వినిపించే పదం ఎల్-నినో. పసిఫిక్ మహాసముద్రంలో మొదలయ్యే ఈ సహజ వాతావరణ ప్రక్రియ ప్రభావం మాత్రం ఒక్క సముద్రానికే పరిమితం కాదు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు, వర్షపాతం, తుఫానులు, కరువు వంటి పరిస్థితులపై దీని ప్రభావం కనిపిస్తుంది. ప్రస్తుతం 2026లో ఏర్పడుతున్న ఎల్-నినో మరింత బలపడుతున్న నేపథ్యంలో దీనిపై ఆసక్తి పెరిగింది. ఎన్.ఓఏఏ తాజా అంచనాల ప్రకారం 2026 చివరి నాటికి ఇది అత్యంత బలమైన ఎల్-నినోల్లో ఒకటిగా మారే అవకాశం ఉంది. కాశ్రీంశీ =ముఃఽ - యనమల కృష్ణుడిని ఆపుతున్నదెవరు? జనసేనలో రెడ్ సిగ్నల్ ఎల్-నినో అంటే ఏంటి? ఎల్-నినో అనేది ఎల్ నినో--సదరన్ ఆసిలేషన్ (ఈఎన్ఎస్ఓ) అనే సహజ వాతావరణ చక్రంలోని వేడి దశ. సాధారణంగా భూమధ్యరేఖకు సమీపంలోని మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా పెరిగినప్పుడు ఎల్-నినో పరిస్థితులు ఏర్పడతాయి. సాధారణ పరిస్థితుల్లో పసిఫిక్‌లో తూర్పు నుంచి పడమర దిశగా వీచే వాణిజ్య గాలులు వెచ్చని నీటిని పశ్చిమ పసిఫిక్ వైపు నెట్టేస్తాయి. ఎల్-నినో సమయంలో ఈ గాలులు బలహీనపడటంతో వెచ్చని సముద్ర జలాలు మధ్య తూర్పు పసిఫిక్ వైపు కదులుతాయి. ఫలితంగా సముద్రం-వాతావరణం మధ్య ఉన్న సాధారణ సమతుల్యత మారుతుంది. మరి దాని ప్రభావం ఎలా ఉంటుంది? ఎల్-నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఒకే విధంగా ఉండదు. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు పెరిగే అవకాశం ఉంటే.. మరికొన్ని ప్రాంతాల్లో వర్షాభావం, కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు దక్షిణ అమెరికాలోని కొన్ని ప్రాంతాలు, తూర్పు ఆఫ్రికా, అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంటుంది. అదే సమయంలో ఆస్ట్రేలియా, ఇండోనేషియా, దక్షిణ ఆఫ్రికా, దక్షిణాసియాలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు తగ్గే పరిస్థితులు కనిపించవచ్చు. అట్లాంటిక్‌లో హరికేన్ కార్యకలాపాలు కూడా సాధారణంగా తగ్గే అవకాశం ఉంటుంది. భారత్‌పై ప్రభావం ఏంటి? భారత్‌కు ఎల్-నినో ముఖ్యమైన అంశం. ఎందుకంటే ఇది భారత రుతుపవనాలపై ప్రభావం చూపగలదు. ముఖ్యంగా ఎల్-నినో బలంగా ఉన్నప్పుడు భారత ఉపఖండంలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంటుంది. అయితే ఎల్-నినో వస్తే తప్పనిసరిగా భారత్‌లో కరువే వస్తుంది అని చెప్పలేం. ఎల్-నినోతో పాటు ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ), స్థానిక సముద్ర ఉష్ణోగ్రతలు, వాయు ప్రసరణ వంటి అనేక అంశాలు కూడా భారత వర్షపాతాన్ని ప్రభావితం చేస్తాయి. 2026లో పాజిటివ్ ఐఓడీ కూడా ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. 'సూపర్ ఎల్-నినో'నా? ఇక్కడే అసలు విషయం ఉంది. 'సూపర్ ఎల్-నినో' అనేది అధికారిక శాస్త్రీయ వర్గీకరణ కాదు. వాతావరణ వంటి సంస్థలు సాధారణంగా ఎల్-నినోను బలహీన, మోస్తరు, బలమైన, అత్యంత బలమైన వంటి వర్గాల్లో వివరిస్తాయి. అయితే ప్రస్తుత ఎల్-నినో మాత్రం సాధారణ స్థాయి కంటే చాలా బలంగా మారుతోంది. ఎన్ఓఏఏ తాజా సెప్టెంబర్ 2026 నివేదిక ప్రకారం ఉత్తర అర్ధగోళ శరదృతువు-శీతాకాలంలో అత్యంత బలమైన స్ట్రాంగ్ ఎల్ నినో ఏర్పడే అవకాశం 90 శాతానికి పైగా ఉంది. అక్టోబర్--డిసెంబర్ 2026 కాలంలో 1950 తర్వాత నమోదైన ఎల్-నినోలను మించే స్థాయికి చేరే అవకాశం 75 శాతంగా అంచనా వేసింది. అందువల్ల ప్రస్తుతం దీనిని మీడియా, వాతావరణ విశ్లేషకులు 'సూపర్ ఎల్-నినో'గా పిలుస్తున్నప్పటికీ శాస్త్రీయంగా చెప్పాలంటే 2026లో చాలా బలమైన, చారిత్రక స్థాయికి చేరే అవకాశం ఉన్న ఎల్-నినో అని చెప్పడం మరింత సరైనది. మొత్తంగా చూస్తే.. ఎల్-నినో ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన పరిణామం కాదు. పసిఫిక్‌లో మొదలైనా వాతావరణ ప్రసరణలో మార్పుల ద్వారా ప్రపంచంలోని అనేక ప్రాంతాల ఉష్ణోగ్రతలు, వర్షపాతం, తుఫానులు, కరువు వంటి అంశాలపై ప్రభావం చూపగలదు. అయితే ప్రతి దేశంలోనూ ఒకే విధమైన ప్రభావం ఉండదు. ప్రస్తుతం బలపడుతున్న 2026 ఎల్-నినో కారణంగా రానున్న నెలల్లో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై మరింత నిశితంగా పరిశీలన అవసరం.

## 25న ఐఎంఎలో వైద్యులకు అడల్ట్ వ్యాక్సినేషన్ పై అవగాహన సభ

**గుంటూరు టౌన్ సెప్టెంబర్ 23 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో వైద్యులకు "అడల్ట్ వ్యాక్సినేషన్"అనే అంశంపై అవగాహన సభ నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ టి . సేవ కుమార్ ,డాక్టర్ బి. సాయికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ శుక్రవారం సాయంత్రం జీఎంఏ హాల్లో నిర్వహించే ఈ సభలో ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ శ్రీ కంటి రఘు, డాక్టర్ ఆర్ .హరికృష్ణ ప్రసంగిస్తారన్నారు. పెద్దలకు ఏఏ వ్యాధులకు ఏఏ వ్యాక్సిన్లు ఏ విధంగా ఉపయోగపడతాయి, ముఖ్యంగా ఊపిరితిత్తుల వ్యాధులకు కారణమవుతున్న నిమోనియా వ్యాక్సిన్ తదితర అంశాలపై ప్రసంగిస్తారన్నారు. నగరంలోని వైద్యులందరూ ఈ అవగాహన సభకు హాజరుకావాలని ఐఎంఏ అధ్యక్ష ,కార్యదర్శులు ఆ ప్రకటనలో కోరారు

## ఆయుర్వేదం అద్భుత వైద్య విధానం



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 23 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఆయుర్వేదం అద్భుత వైద్య విధానమని పొట్టిశ్రీ రాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర సుధీర్ అన్నారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆయుష్ సహకారంతో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సెమినార్ హాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ భారతీయులకు సొంతమైన ఆయుర్వేదం యావత్ ప్రపంచానికి అపూర్వమైన వైద్య సేవలందించే గొప్ప సాధనంగా ఉందన్నారు. డాక్టర్ నోరి రామశాస్త్రి ప్రభుత్వ వైద్యకళాశాల వైద్యనిపుణురాలు డాక్టర్ ఆర్ విజయశాంతికుమారి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారంతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఆయుర్వేదంలో అనేక వ్యాధులను ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా మంచి మందులు ఉన్నాయన్నారు. ఆయుర్వేద వైద్య విధానాన్ని అందరూ ఆదరించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్, కోశాధికారి కాజా రాఘవయ్య, ఎన్ఎస్ఎస్ పీవోలు నవీన్‌కుమార్, బీ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ దేవీ కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో చోరీ

### హుండీ పగులగొట్టి వేలాది రూపాయలు దోచుకొన్న దుండగులు
### సంఘటన స్థలానికి చేరుకొని ప్రాథమిక దర్యాప్తు చేపట్టిన కొత్తపేట పోలీసులు



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 23 :(వార్త ప్రభ ప్రతినిధి )**విజయవాడ కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ అమ్మవారి శక్తి పీఠంలో బుధవారం తెల్లవారు జామున జరిగిన ఓ దొంగతనం సంచనం సృష్టించింది. సంఘటన స్థలానికి పరుగులు తీసిన పోలీసులు ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. పోలీసుల సమాచారం, సేకరించిన వివరాలు ప్రకారం సీ వీ ఆర్ ప్లై ఓవర్ బ్రిడ్జి కి తూర్పు దిక్కున ఉన్న శ్రీ దేవీ కరుమారి అమ్మన్ శక్తి పీఠం ప్రాంగణంలో ఉన్న భక్తుల కానుకల హుండీ ని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి దానిలోని వేలాది రూపాయల కానుకలు ఎత్తుకెళ్లారు. చోరి జరిగిన విషయాన్ని గుర్తించిన పూజారి శక్తి పీఠం పీఠ ధిపతులు శ్రీశ్రీశ్రీ కరుణానంద స్వామి కి సమాచారం అందించారు. అయన కొత్తపేట పోలీసులకు చెప్పడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. సంఘటన స్థలానికి చేరుకొన్న సీ ఐ కొండలరావు, క్రైమ్ ఎస్ ఐ హరి ప్రసాద్ నేరం జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. శక్తి పీఠంలో ఉన్న సీ సీ కెమెరాల ఫుటేజలని పరిశీలించి దొంగలు ఆచూకీ కోసం గాలిస్తున్నారు. శక్తి పీఠం ట్రస్ట్ కార్యదర్శి ఎస్ జ్ఞానేశ్వర్ పిర్యాదు మేరకు పోలీసులు బుధవారం ఉదయం కేసు నమోదు చేశారు. కాగా గుడి ప్రాంగణంలో తాళాలు పగుల కొట్టకుండా గుడిలోకి దొంగలు రాగలిగిన మార్గాల పై పోలీసులు ద్రుష్టి సారించారు. హుండీ పగులకొట్టడానికి దొంగలు వాడిన సుత్తులు, శానం, పరికరాలు సంఘటన స్థలంలోనే వదిలేసి పరారయ్యారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించారు

## డా. ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల్లో ఘనంగా
# 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకలు





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 23 :(వార్త ప్రభ ప్రతినిధి)** 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని డా. ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల, విజయవాడలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.వేడుకల్లో భాగంగా ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం మరియు ఆయుర్వేద వైద్య విధాన అభివృద్ధి కోసం శ్రీ ధన్వంతరి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయుష్ శాఖ డైరెక్టర్ గోపాలకృష్ణ రొణంకి,ఐ ఏ ఎస్ , అదనపు డైరెక్టర్ డా. పి. సాయి సుధాకర్ మరియు డిప్యూటీ డైరెక్టర్ జె. ధనుంజయరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సీ సీ ఆర్ ఏ ఎస్ -- ఎస్ పీ ఏ ఆర్ కే స్కాలర్‌షిప్‌కు ఎంపికైన యు జీ విద్యార్థులు మరియు పీ జీ స్కాలర్లకు చెక్కులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. అలాగే జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలు, కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచి



బహుమతులు సాధించిన విద్యార్థులకు అవార్డులు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని డా. టి. బుల్లయ్య, ప్రిన్సిపాల్ , డా. ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల మరియు డా. పి. జగదీష్, మెడికల్ సూపరింటెండెంట్, డా. ఏ.ఎల్. ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి, విజయవాడ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పీ జీ స్కాలర్లు, ఇంటర్న్లు మరియు ఆసుపత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ వేడుకలు ఆయుర్వేద విద్య, పరిశోధన, వైద్య సేవలు మరియు ప్రజల్లో ఆయుర్వేదంపై అవగాహన పెంపొందించడంలో డా. ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల యొక్క నిబద్ధతను ప్రతిబింబించాయి.

## లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరం జయప్రదం





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 23 :(వార్త ప్రభ ప్రతినిధి)**లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్, ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ ఆయుష్ శాఖ మరియు ఆయుష్మాన్ భారత్ సంయుక్త సహకారంతో జాతీయ ఆయుర్వేద దినోత్సవం మరియు శ్రీ ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని వై.ఎస్.ఆర్. కాలనీలోని గౌతమ్ పబ్లిక్ స్కూల్‌లో ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు.?బుధవారం ప్రారంభమైన ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయన ధన్వంతరి స్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు గౌతమ్ స్కూల్ అధినేత లైన్ ఎన్. సూర్యారావు మరియు లయన్స్ క్లబ్ సభ్యులు ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.

**417 మందికి ఉచిత వైద్య పరీక్షలు ,మందుల పంపిణీ:**ఈ శిబిరంలో ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ ఆయుష్ శాఖకు చెందిన నిపుణులైన వైద్యాధికారుల బృందం --- డాక్టర్ పీ సుకన్య, ఎమ్ డీ , డాక్టర్ వై రత్న ప్రియదర్శిని, ఎమ్ డీ , డాక్టర్ ఎన్ కవిత బీ ఏ ఎమ్ ఎస్ , డాక్టర్ జే పద్మజ బీ ఏ ఎమ్ ఎస్ , డాక్టర్ జునేద్, ఎమ్ డీ , మరియు డాక్టర్ నారాయణం విష్ణువర్ధన్, ఎమ్ డీ పాల్గొన్నారు. వారు మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి, ఆస్తమా, అలర్జీలు, మధుమేహం, రక్తపోటు, చర్మ వ్యాధులు, గ్యాస్ట్రిక్ మరియు మహిళల ప్రత్యేక ఆరోగ్య సమస్యలతో పాటు పలు దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో ఇప్పటివరకు 652 మంది ప్రజలు పాల్గొనగా, వారందరికీ ఉచితంగా ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ అధ్యక్షులు ఎన్. డి. వి. ప్రసాద్, కార్యదర్శి వై. నారాయణస్వామి, కోశాధికారి ఎస్. ఈశ్వరరావు, జోన్ చైర్‌పర్సన్ వై. బాబు రావు, ప్రోగ్రామ్ కమిటీ చైర్‌పర్సన్ లైన్ ఎన్. సూర్యారావు (గౌతమ్ స్కూల్ అధినేత), బి. ఎస్. కే. పట్నాయక్, లైన్స్ లీడర్ లైన్ ఎన్.వి. రావు, బిసి నాయకులు బాబురావు , ఓబిసి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, గౌతమ్ స్కూల్ ప్రిన్సిపల్ పి. తులసి, ఆయుష్ శాఖ వైద్యాధికారులు, లయన్స్ క్లబ్ సభ్యులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## వర్షాల నేపథ్యంలో మురుగునీటి ప్రవాహానికి ఎలాంటి అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 23 :(వార్త ప్రభ ప్రతినిధి )**వర్షాల నేపథ్యంలో మురుగునీటి ప్రవాహానికి ఎలాంటి అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు . బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా టిక్కెల్ రోడ్, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్, గాయత్రీ నగర్, ఐదవ నంబర్ రూట్, రమేష్ హాస్పిటల్స్ జంక్షన్, లయోలా కాలేజ్ రోడ్, హరిజనవాడ, డెంటల్ కాలేజ్ రోడ్, పుల్లేటికట్ట డ్రెయిన్, ఏలూరు రోడ్, ఎస్.ఆర్.ఆర్. కాలేజ్, గులాబీ తోట తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, రహదారుల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా గాయత్రీ నగర్‌లో జరుగుతున్న ఔట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలించిన కమిషనర్, పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మాచవరం ఎస్.ఆర్.ఆర్.-సి.వి.ఆర్. కాలేజ్ సమీపంలోని రహదారిపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చి రహదారిని పునరుద్ధరించాలని సూచించారు. నగరంలోని ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులపై గుంతలు ఏర్పడకుండా అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, గుంతలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గులాబీ తోటలోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ ఆహార నాణ్యత, వంటశాల నిర్వహణ, మౌలిక వసతులు తదితర అంశాలను పరిశీలించి, ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. క్యాంటీన్‌లో ఏవైనా సమస్యలు గుర్తించిన వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కలిమిశ్రీకి 'ఆదిత్య - పిఠాపురం మహారాజా' సాహితీ సేవా పురస్కారం





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 23 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఆదిత్య విద్యాసంస్థలు అక్టోబరు 5న పిఠాపురంలో నిర్వహించనున్న పిఠాపురం మహారాజా గారి 141వ జయంతి వేడుకల్లో తొలిసారిగా అందజేస్తున్న ఆదిత్య - పిఠాపురం మహారాజా సాహితీ సేవా పురస్కారానికి 'మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, 'నవమల్లెతీగ' మాసపత్రిక సంపాదకులు కలిమిశ్రీని ఎంపిక చేసినట్లు ఆదిత్య విద్యాసంస్థల యాజమాన్యం తెలియజేసింది. మూడు దశాబ్దాలుగా పత్రికారంగంలోనూ, రెండు దశాబ్దాలుగా మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ద్వారా, నవమల్లెతీగ సాహిత్య మాసపత్రిక ద్వారా సాహితీరంగానికి చేస్తున్న సేవల్ని పరిగణలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఆయన్ని ఎంపిక చేసినట్టు విద్యాసంస్థల యాజమాన్యం తెలియజేసింది. 'ప్రణామం', 'జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు', 'కృష్ణాతీరం కవితాహారం', 'సృజనోత్సవం' వంటి ఎన్నో వినూత్న కార్యక్రమాలతో కవుల్ని ప్రోత్సహిస్తూ, సముచిత రీతిన వారిని గౌరవిస్తూ సత్కరిస్తూ ఒక కొత్త సాహితీ సమాజాన్ని నిర్మించడంలో కలిమిశ్రీ కీలకపాత్ర పోషిస్తున్నారని, పురస్కార ప్రదాన సభలో రూ.10,000/-ల నగదుతో ఆయన్ని ఘనంగా సత్కరించనున్నట్టు ఆదిత్య యాజమాన్యం తెలియజేసింది. కలిమిశ్రీ ఇటీవల నవమల్లెతీగ మాసపత్రిక 100వ సంచికను ప్రత్యేక సంచికగా వెలువరించి తొలి కాపీని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి అందజేశారు.

## ఎలక్ట్రానిక్స్‌లో విస్తృత ఉపాధి అవకాశాలు



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 23 :(వార్త ప్రభ ప్రతినిధి )**ఎలక్ట్రానిక్స్‌లో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ షేక్ మీరాషరీఫ్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు -- ప్రస్తుత ట్రెండ్స్ భవిష్యత్ అవకాశాలపై సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ షేక్ మీరా షరీఫ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాపితంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ వెహికిల్ టెక్నాలజీ, బ్యాటరీ ఛార్జింగ్, మౌలిక సదుపాయాలు, పవర్ ఎలక్ట్రానిక్స్, ఎనర్జీ స్మార్ట్ మొబిలిటీ తదితర అనుబంధ రంగాల్లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. డాక్టర్ ఎస్ శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు తరగతి బోధనతో పాటు పరిశ్రమలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన కల్పించటం ఎంతో అవసరమన్నారు. ఇటువంటి సాంకేతిక సమస్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్ రాజేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు వారి రంగంలో వస్తున్న మార్పులను, అవకాశాలను తెలియజేసే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు.

## అవుట్‌ఫాల్ డ్రెయిన్ల డీసిల్టింగ్ పనులను పరిశీలించిన కమిషనర్ ధ్యానచంద్ర





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 23 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఉదయం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలోని అవుట్‌ఫాల్ డ్రెయిన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా వేముల శ్యామలాదేవి రోడ్, కండ్రిక జంక్షన్, ఇన్నర్ రింగ్ రోడ్, డీసిల్టింగ్ పనులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి, అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో కొనసాగుతున్న డీసిల్టింగ్ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో నీటి ప్రవాహానికి ఎటువంటి అంతరాయం కలగకుండా విస్తృతంగా డీసిల్టింగ్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కేవలం వర్షాలు పడుతున్న సమయంలోనే కాకుండా ఏడాది పొడవునా డ్రెయిన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ డీసిల్టింగ్ పనులు చేపడుతున్నప్పటికీ, వర్షాలు కురిసే సమయంలో మరింత అప్రమత్తంగా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా డీసిల్టింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, నీటి ప్రవాహానికి ఎక్కడా ఆటంకాలు ఏర్పడకుండా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు.

**ఆర్ఓ వాటర్ ప్లాంట్‌పై ఆకస్మిక తనిఖీ** అనంతరం పాతపాడు లోని ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను కమిషనర్ ధ్యానచంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లో క్రమం తప్పకుండా నీటి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నారా, పరీక్షల నివేదికలు సక్రమంగా ఉన్నాయా, ప్రజలకు శుద్ధమైన తాగునీటిని మాత్రమే సరఫరా చేస్తున్నారా, ట్రేడ్ లైసెన్స్ ఉందా, ప్లాంట్ పరిసరాల్లో పారిశుధ్య, పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగరంలోని ఆర్ఓ వాటర్ ప్లాంట్లపై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ నివేదికలు సమర్పిస్తున్నప్పటికీ, ప్రజలకు అందించే తాగునీటి నాణ్యతను నిర్ధారించేందుకు ఆకస్మిక తనిఖీలు కూడా నిరంతరం నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు.

# వైసీపీ నేతల వేధింపులపై గ్రీవెన్స్ లో ఫిర్యాదు

- గత ప్రభుత్వంలో రీసర్వే నిర్వాకం.. రికార్డుల్లో 5 సెంట్ల భూమి గల్లంతు
- ఉద్యోగాల పేరుతో ఘరానా మోసం.. రూ. 3.90 లక్షలు స్వాహా
- కోర్టు తీర్పును బేఖాతరు చేస్తూ భూమి కబ్జా యత్నం.. న్యాయం చేయాలంటూ వినతి
- అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు
- ఎమ్మెల్సీ వర్ల రామయ్య, ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు





**విజయవాడ సెప్టెంబర్ 23 :(వార్త ప్రభ ప్రతినిధి)** సత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండలం కుసుమవారిపల్లి గ్రామానికి చెందిన ఇ. రంగప్ప నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. తాను మొదటి నుంచీ తెలుగుదేశం పార్టీ అభిమానిగా ఉన్నానని, 2024 అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజున ఓటు వేసేందుకు వెళ్లగా స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన ఇంద్రప్ప, బి. మంజునాథ్, డి. గంగులప్ప, వి. చంద్ర, డి. రామాంజనేయులు, కె. లక్ష్మీపతి రెడ్డి, కె. గోవర్ధన్ రెడ్డి, వెంకటలక్ష్మి తదితరులు తనపై తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు. అంతేకాకుండా తన ద్విచక్ర వాహనాన్ని ( ఏ పీ 02 ఏ క్యూ 1259) తగలబెట్టారు. అక్కడితో ఆగకుండా, ప్రత్యర్థులు స్థానిక పోలీసులపై ఒత్తిడి తెచ్చి తనపైనే అక్రమంగా రౌడీషీట్ ఓపెన్ చేయించి సబ్ జైలుకు పంపించారు. తనకున్న గడ్డివాములను తగలబెట్టి, ఇంటి సామాన్లు బయటపడేసి ఇంటిని ధ్వంసం చేయడంతో పాటు, గ్రామంలోకి అడుగుపెట్టకుండా వెలివేశారు. న్యాయం కోసం కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, స్థానిక పోలీస్ స్టేషన్ల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని నేతలు ఎమ్మెల్సీ వర్ల రామయ్య, ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబులకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.పల్నాడు జిల్లా అమరావతి మండలం మండేపూడి గ్రామానికి చెందిన బండ్లమూడి సురేష్ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. పెదకూరపాడు మండలం పాడిబండ్ల గ్రామంలోని తమ భూమి తమకు భూమి ఉంది. సర్వే నంబర్ 9లో 1.32 ఎకరాలు, సర్వే నంబర్ 101లో 2.10 ఎకరాలు వెరసి మొత్తం 3.42 ఎకరాల భూమి ఉండాల్సి ఉండగా, గత ప్రభుత్వంలో తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రీ సర్వే నిర్వహించారు. ఆ రీసర్వే రికార్డుల్లో 3.37 ఎకరాలుగా మాత్రమే నమోదు చేశారు. తగ్గిన 5 సెంట్ల భూమి విషయంపై పలుమార్లు అధికారులను కలిసిన ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు. నంద్యాల జిల్లా శ్రీశైలం మండలం సున్నిపెంట గ్రామానికి చెందిన చందం గాలెయ్య, మిద్దె రవి కుమార్ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..ప్రకాశం జిల్లాకు చెందిన అశోక్ అనే వ్యక్తి, ప్రభుత్వంలోని ప్రముఖుల పేర్లు, దేవాదాయ శాఖ కమిషనర్ తెలుసంటూ నమ్మబలికాడు. సచివాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మొత్తం ఆరుగురి వద్ద నుంచి రూ. 3,90,000 వసూలు చేశాడు. ఉద్యోగాలు రాకపోతే డబ్బులు తిరిగి ఇచ్చేస్తానని మాటిచ్చి, ఫేక్ సర్టిఫికెట్లు చూపించి నమ్మించాడు. దాదాపు రెండేళ్లు గడుస్తున్నా ఉద్యోగాలు ఇప్పించకపోగా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఫోన్ ఎత్తడం కూడా మానేశాడు. దీనిపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. బాపట్ల జిల్లా కారంచేడు మండలం యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన టి. వెంకటరెడ్డి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెంబర్ 146-1 లో 1 ఎకరం 98 సెంట్ల భూమి ఉంది. అయితే, ఈ భూమిని వెంకట రమణారెడ్డి అనే వ్యక్తి అక్రమంగా తన పేరు మీద ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఈ భూమిపై తమకు అనుకూలంగా న్యాయస్థానం ఆదేశాలు ఉన్నప్పటికీ రికార్డులను తారుమారు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వేరొకరి పేరిట నమోదైన ఆన్‌లైన్ రికార్డును తక్షణమే రద్దు చేసి, కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆ భూమిని తమ కుటుంబానికి స్వాధీనం చేసి, తమ పేరిట ఆన్‌లైన్ హక్కులు కల్పించాలని కోరాడు.తిరుపతి జిల్లా మంగళం గ్రామానికి చెందిన కోమల తిరుపత్తూరు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో 60ఐ40 కొలతలతో కూడిన నివాస స్థలం ఉండేది. అయితే రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తొలుత తమ స్థలంలో సగం భాగాన్ని తీసుకున్నామని అధికారులు తెలిపారు. ఆ తర్వాత స్థలం మొత్తాన్ని రోడ్డు విస్తరణలోనే కోల్పోయారని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ అధికారులు చెబుతూ, అక్కడ ఇల్లు కట్టుకునేందుకు అనుమతించకుండా నిరాకరిస్తున్నారు. గత 8 సంవత్సరాలుగా పరిహారం కోసం తిరుపతి కలెక్టరేట్, తుడా కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ప్రస్తుతం తాను క్యాన్సర్, కిడ్నీ సంబంధిత తీవ్ర వ్యాధులతో బాధపడుతున్నాను. హైదరాబాద్‌లో ఉండే తాము ప్రస్తుతం క్యాన్సర్ చికిత్స నిమిత్తం బెంగళూరులో ఉంటూ తీవ్ర అనారోగ్యంతో ప్రయాణాలు కూడా చేయలేని స్థితిలో ఉన్నాను. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.బాపట్ల జిల్లా అమృతలూరు గ్రామానికి చెందిన రామకృష్ణ ప్రసాద్ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ అన్నయ్య శరణు రత్నచంద్ 1963లో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలిగిరి మండలం పెదకొండూరు గ్రామంలో 26.50 ఎకరాల మెట్టభూమిని కొనుగోలు చేశారు. రత్నచంద్ అనారోగ్యంతో ఉన్న సమయంలో 1992లో వీలునామా ద్వారా రామకృష్ణప్రసాద్ రెండో కుమారుడు శరణు వినయ్‌కుమార్‌కు ఈ భూమి హక్కులను బదిలీ చేశారు. 1994 జూన్ 25న నాటి కలిగిరి ఎంఆర్ఓ రికార్డుల్లో మార్పిడి పూర్తి చేసి, భూమి శిస్తు కూడా స్వీకరించారు. కాలక్రమంలో ఆ భూమిని కుటుంబ సభ్యుల వద్ద మేనల్లుడైన మన్నవ శ్రీనివాసరావు కౌలుకు తీసుకోగా, ఆయన మరణానంతరం ఆయన కుమారుడు మన్నవ రవిచంద్ర సాగు చేసుకుంటూ వచ్చారు. అయితే, రికార్డులను ఆన్‌లైన్ చేయాలని రెవెన్యూ అధికారులను పలుమార్లు సంప్రదించినా కార్యాలయాల చుట్టూ తిప్పించుకున్నారే తప్ప పని కాలేదు. ఇటీవల సర్వే పూర్తయి నివేదిక తహశీల్దార్‌కు అందినా, వీఆర్వో నివేదిక రాలేదంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారు. తీరా ఆరా తీస్తే... మన్నవ రవిచంద్ర తన పలుకుబడి ఉపయోగిస్తూ, రత్నచంద్ తమకు అప్పు పడ్డారని, ఆ బాకీ కింద ఈ 26.50 ఎకరాల భూమిని తమకే అప్పగించారంటూ ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాలు సృష్టించి అక్రమంగా దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడైంది. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

## పదవీ విరమణ పొందిన ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం



**ఆగిరిపల్లి, సెప్టెంబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆగిరిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీలు, ఎంపీపీ, జడ్పిటిసి పదవీకాలం ముగిసిన సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ఎస్.కె. అబ్దుల్ సలాం నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీడీవో అబ్దుల్ సలాం మాట్లాడుతూ, పదవీకాలంలో ఎంపీటీసీలు, ఎంపీపీ, జడ్పీటీసీలు మండల అభివృద్ధికి తమవంతు సహకారం అందించారని, అధికారులతో గౌరవప్రదంగా సమన్వయంతో పనిచేశారని తెలిపారు.ఎంపీటీసీ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎంపీటీసీలకు రాజకీయ అండదండలు, అధికారుల సహకారం ఉంటేనే మరింత సమర్థవంతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తాను ఎంపీటీసీగా ఉన్న సమయంలో తన గ్రామ అభివృద్ధికి కృషి చేశానని తెలిపారు.పదవీకాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీలు, ఎంపీపీ, జడ్పీటీసీలను శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఎంపీటీసీలు, జడ్పీటీసీ పదవీకాలం ముగిసి పదవీ విరమణ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.మండల పరిషత్, ఆగిరిపల్లి తరఫున ఎంపీడీవో ఎస్.కె. అబ్దుల్ సలాం, ఏఈ వాసుదేవరావు, సీనియర్ అసిస్టెంట్ వెంకట రామరాజు, జూనియర్ అసిస్టెంట్ జోసెఫ్ విజయ్, టైపిస్టులు క్రాంతి, నవ్య ప్రసన్న, ఆఫీస్ సబార్డినేట్స్ శివశంకర్, వినీల, త్రివేణి తదితరులు పాల్గొని పదవీ విరమణ పొందిన ప్రజాప్రతినిధులను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం జ్ఞాపికలు (మెమెంటోలు) అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పదవీకాలంలో మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అందించిన సేవలను అధికారులు అభినందించారు. అనంతరం అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు.

## ఆర్మీ జవాన్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన జనసేన నేత గుడిపాటి



**విజయవాడ, సెప్టెంబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గుడిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 45 సంవత్సరాలు సందర్భంగా వినాయక చవితి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించడం ఆచార సాంప్రదాయ బద్ధంగా వస్తుందని గుడిపాటి ఫౌండేషన్ వ్యవస్థాపకులు జనసేన పార్టీ విజయవాడ నాయకులు గుడిపాటి సీతారాం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్వర ఆసుపత్రి వైద్యులు వెంకట్, సీఐ మజ్జి గురునాయుడు, గుడిపాటి దత్తు, ఫణి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ధైర్యంగా సేవలు అందించి మాతృ భూమి కోసం తన ప్రాణాలను అర్పించిన అమరవీరుని త్యాగాన్ని స్మరించుకుంటూ వారి తల్లికి గుడిపాటి ఫౌండేషన్ తరపున 20,000 మరియు స్థానికులు సహాయంతో మరికొంత ఆర్థిక సహాయం కలిపి మొత్తం 50,000 రూపాయలు అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమం ఉద్దేశించి గుడిపాటి ఫౌండేషన్ వ్యవస్థాపకులు జనసేన పార్టీ విజయవాడ నాయకులు గుడిపాటి సీతారాం మీడియాతో మాట్లాడారు. దేశ రక్షణ కోసం ధైర్యంగా తన ప్రాణాలను నిస్వార్థంగా అర్పించిన అమరవీరుని గోవింద్ సేవలు అందరు స్మరించుకోవాలన్నారు. దేశ రక్షణ శాఖలో పని చేయడం అంటే నిస్వార్ధంగా తన కుటుంబ సభ్యుల్ని కూడా వదిలి ఊరు కాని ఊరు వెళ్లి నెలలు తరబడి దేశ రక్షణలో చావాలనిపించడం నిజంగా కొనియాడ దగ్గర విషయమని అన్నారు.

## పేదల వైద్యానికి అండగా కూటమి ప్రభుత్వం

**227 మందికి రూ.1.08 కోట్ల సీఎంఆర్ఎఫ్ రీయింబర్స్‌మెంట్ చెక్కులు అందజేత.**

**మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్**

**ఇబ్రహీంపట్నం,సెప్టెంబర్ 23(వార్తా ప్రభ ప్రతినిధి):**అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల విషయంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా అండగా నిలుస్తోందని మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు మైలవరం నియోజకవర్గం వ్యాప్తంగా ముఖ్యమంత్రి సహాయనిధి రీయింబర్స్‌మెంట్ చెక్కులు, ఎల్‌ఓసీల రూపంలో మొత్తం రూ. 27,20,36,573 ఆర్థిక సహాయం మంజూరైనట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వెల్లడించారు.ఇబ్రహీంపట్నంలోని ముత్తవరపు వారి కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో తాజాగా మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి రీయింబర్స్‌మెంట్ చెక్కులను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా 227 మంది లబ్ధిదారులకు రూ. 1,08,26,169 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి.ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ అక్కల రామ్మోహనరావు (గాంధీ), చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, జంపాల సీతారామయ్య, చుట్టుకుదురు శ్రీనివాస్, చనుమోలు నారాయణ,కరిమికొండ బాలాజీ, కూటమి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా టీడీపీ నేత, క్లస్టర్ ఇంఛార్జి గరికపాటి శివ జన్మదిన వేడుకలు



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 23(వార్తా ప్రభ ప్రతినిధి) :**ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, క్లస్టర్ ఇంఛార్జి గరికపాటి శివ జన్మదిన వేడుకలను బుధవారం ఇబ్రహీంపట్నం లో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ను శాలువాతు సత్కరించి, కేక్ కట్ చేశారు. ఆత్మీయంగా కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గరికపాటి శివ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొని గరికిపాటి శివకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఔషధాల సురక్షిత వినియోగంపై అవగాహన పెంపొందించాలి

**- ఎస్వీ వైద్య కళాశాలలో జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవ ముగింపు**





**తిరుపతి, సెప్టెంబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఔషధాలను సురక్షితంగా, హేతుబద్ధంగా వినియోగించడంతో పాటు ప్రతికూల ఔషధ ప్రతిచర్యలను (ఏడీఆర్) గుర్తించి, సకాలంలో నివేదించడం ద్వారా రోగుల భద్రతను మరింత మెరుగుపరచవచ్చని ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్యా సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవి ప్రభు పేర్కొన్నారు. బుధవారం ఎస్వీ వైద్య కళాశాలలో నిర్వహించిన 6వ జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్--నేషనల్ కోఆర్డినేషన్ సెంటర్, ఫార్మాకోవిజిలెన్స్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుంచి 23 వరకు ఈ వారోత్సవాలను నిర్వహించారు. ఎస్వీ వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగంలోని ఏడీఆర్ మానిటరింగ్ సెంటర్ ఆధ్వర్యంలో రోగులు, వారి సహాయకులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, సాధారణ ప్రజలకు ఔషధాల సురక్షిత వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు."ఔషధ సురక్షిత సంరక్షణ వైపు ఒక అడుగు: ఫార్మాకోవిజిలెన్స్ ద్వారా మందుల హేతుబద్ధమైన వినియోగాన్ని ప్రోత్సహించడం" అనే ఇతివృత్తంతో వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రతికూల ఔషధ ప్రతిచర్యలను గుర్తించడం, పర్యవేక్షించడం, నివేదించడం, రోగుల భద్రతలో ఫార్మాకోవిజిలెన్స్ ప్రాధాన్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు.వారోత్సవాల్లో భాగంగా అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్లు, అనుబంధ ఆరోగ్య శాస్త్ర విద్యార్థులకు వ్యాసరచన, ఈ-పోస్టర్ ప్రెజెంటేషన్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో ఏఎంసీ కోఆర్డినేటర్, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ యు. భారతి, డిప్యూటీ కోఆర్డినేటర్, ఫార్మకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వై. లక్ష్మి, సీనియర్ ఫార్మాకోవిజిలెన్స్ అసోసియేట్ డాక్టర్ ఆర్. రాజలక్ష్మి, ఫార్మకాలజీ విభాగం వైద్య అధ్యాపకులు, పీజీ విద్యార్థులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నులిపురుగుల నిర్మూలనతోనే పిల్లల ఆరోగ్యకర భవిష్యత్ : ఎమ్మెల్యే పులివర్తి నాని



**చంద్రగిరి, సెప్టెంబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి):** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 25న నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు నులిపురుగుల నిర్మూలన ఎంతో అవసరమని అన్నారు. ప్రతి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.తిరుపతి జిల్లా యంత్రాంగం, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 25న ప్రధానంగా పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లల కోసం అక్టోబర్ 5న మాప్-అప్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు.'ఆరోగ్యవంతమైన పిల్లలు-- స్వచ్ఛమైన భావి భారత్' లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. నులిపురుగుల నివారణ ద్వారా పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలను తగ్గించడంతో పాటు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు.పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీపీ ఎం. హేమేంద్ర కుమార్ రెడ్డి, ఎంపీడీవో దేవిక, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. శిరీష, మార్కెట్ కమిటీ చైర్మన్ గౌస్ బాషాతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## కండ్రికలో ఘనంగా ముగిసిన గణపతి ఉత్సవాలు



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 23(వార్త ప్రభ ప్రతినిధి )**వినాయక చవితి పండుగ సందర్భంగా సెంట్రల్ నియోజకవర్గం 64వ డివిజన్ కండ్రికలో శ్రీ లక్ష్మీగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రారంభమైన గణపతి మహోత్సవములు 10వ రోజు బుధవారం అత్యంత వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం కార్యక్రమం నిర్వహికులు కే. రవి కుమార్, వరలక్ష్మి దంపతులు, కమిటీ సభ్యులు గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు కే .రవికుమార్ వరలక్ష్మి దంపతులు మాట్లాడుతూ వినాయక చవితి పండుగ పురస్కరించుకుని గణపతి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఉత్సవాలలో ప్రతిరోజు అన్న వితరణ కార్యక్రమం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమం జరిగింది. సాయంత్రం జరిగిన వేలంపాటలో లడ్డును స్థానికులు పాడుకున్నారు. అనంతరం ఘన నాధుని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా విగ్రహ నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున స్థానికులు తరలివచ్చి విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అల్లు మహేష్, పొలిశెట్టి చంద్ర శేఖర్, పల్లెల రవి, అల్లు నరేంద్ర,తోట సత్యనారాయణ,తోట వెంకట ప్రసాద్,పట్టేంశెట్టి నాగమణి,టి నాగరాజు,సి. జటాధర్,ఇ.హరికృష్ణ రెడ్డి,కె. హర్ష సాయి, కోమరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులను తలపిస్తున్న ఆగిరిపల్లి-నూజివీడు ప్రధాన రహదారి

**డ్రైనేజీలు మూసివేయడంతో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు వాహనదారులు, బాటసారులకు తీవ్ర ఇబ్బందులు -- సమస్య పరిష్కరించాలని స్థానికుల విజ్ఞప్తి**



**ఆగిరిపల్లి, సెప్టెంబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)):** ఆగిరిపల్లి--నూజివీడు ప్రధాన రహదారిపై వర్షపు నీరు భారీగా నిలిచిపోవడంతో రహదారి చెరువులను తలపిస్తోంది. దీంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు .రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీలను పూడ్చి నిర్మాణాలు చేపట్టడంతో వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం లేక రోడ్డుపైనే నిలిచిపోతుందని స్థానికులు చెబుతున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో నిలిచిన నీరు బాటసారులపై పడుతూ ఇబ్బందులకు గురిచేస్తోంది. రహదారిపై నీరు నిలిచిపోవడంతో ప్రమాదాల భయం కూడా నెలకొంది.సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి, వర్షపు నీరు సక్రమంగా వెళ్లేలా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## ఘనంగా శ్రీ బాలగణపతి స్వామివారి 41 వ నవరాత్రి ఉత్సవాలు.

**ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 23 :(వార్త ప్రభ ప్రతినిధి)** వన్ టౌన్ లోని శ్రీ బాల గణపతి స్వామివారి సన్నిధిలో వినాయక చవితి ఉత్సవములు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ చవితి ఉత్సవాల్లో పాల్గొని విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు ఉత్సవాల్లో గణపతికి పంచ హారతులు ఇస్తూ కోలాటాల నృత్యాలు ప్రదర్శించడంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభతో వెల్లి విరిసింది.శ్రీ బాలగణపతి స్వామి ఆలయ అధ్యక్షులు గ్రంధి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మామిడి లక్ష్మి వెంకట కృష్ణారావు,కోశాధికారి మండేపూడి వేణుగోపాలరావు, ఉత్సవ కమిటీ సభ్యులు రాయుడు శ్రీనివాస్ కార్యవర్గ సభ్యులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజమండ్రిలో ముగిసిన పోషణ్ మాహ్ ప్రదర్శన

## ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు హాజరు




**రాజమండ్రి:సెప్టెంబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సి.బి.సి.) ఫీల్డ్ ఆఫీస్, కాకినాడ ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణ్ మాహ్ సందర్భంగా రాజమండ్రిలో నిర్వహించిన రెండ్రోజుల పోషకాహార ప్రదర్శన ముగింపు సభ నేడు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు.?విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ, చిరుధాన్యాలను (మిల్లెట్స్) ఆహారంలో భాగం చేసుకోవాలని, సుపోషిత భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పోషకాహార స్టాళ్లను పరిశీలించి, ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బంది సేవలను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీల విజేతలకు ఆయన బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన సోము వీర్రాజు ని సీబీసీ అధికారులు శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు.

# ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వహించాలి

## కమిషనర్ ఎం. జయకృష్ణ



**తిరుపతి : సెప్టెంబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల విధులను అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ తెలిపారు. నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల విధుల నిర్వహణపై నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ జయకృష్ణ అధ్యక్షతన ఆర్వో, ఏఆర్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆర్వో, ఏఆర్వోల నియామకానికి ఆమోదం తెలిపిందన్నారు. ఎన్నికల నిర్వహణ అత్యంత కీలకమైనదని తెలిపారు. ఆర్వో, ఏఆర్వోల పనితీరుపైనే ఎన్నికల విశ్వసనీయత ఆధారపడి ఉంటుందన్నారు. ఎన్నికల నిర్వహణపై అధికారులు అందరికీ తగిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సీనియర్ అధికారులు తమ కింద పనిచేసే సిబ్బందికి సరైన మార్గదర్శకత్వం చేయాలని తెలిపారు. మొదటి విడతగా పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం వెబ్ సైట్ ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తాజా సూచనలతో అప్ డేట్ గా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శారదా దేవి, ఉప కమిషనర్ అమరయ్య, తహసీల్దార్ సురేష్ బాబు, ఏసిపి మూర్తి మరియు వివిధ విభాగాల అధికారులు ఆర్వోలు పాల్గొన్నారు

# వినాయకునికి వైభవంగా వీడ్కోలు



**ఆగిరిపల్లి, సెప్టెంబర్ 23 వార్తా ప్రభ.)** ఆగిరిపల్లి లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరడంతో గణేష్ నిమజ్జన వేడుకలు అత్యంత వైభవంగా వీడ్కోలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలోని పురవీధులన్నీ భక్తుల "గణపతి బప్పా మోరియా" నినాదాలతో మార్మోగిపోయాయి. గ్రామంలోని పలు వీధుల్లో ప్రతిష్టించిన గణేష్ విగ్రహాలను డీజే చప్పుళ్లు, సాంప్రదాయ కోలాటాలు, భజన కీర్తనల నడుమ శోభాయాత్రగా తరలించారు. యువకుల నృత్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ఊరేగింపు కోలాహలంగా సాగింది. గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి గణనాథుడికి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు. ఈ శోభాయాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు గట్టి నిఘా ఉంచి పటిష్ట బందోబస్తు నిర్వహించడంతో నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా, ప్రశాంతంగా ముగిసింది.

# మద్యం మత్తులో విద్యుత్ స్తంభం ఎక్కి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి):** మద్యం మత్తులో ఓ వ్యక్తి విద్యుత్ స్తంభం ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నంలోని ఎన్టీటీపీఎస్ వేడినీళ్ల కాలువ కట్ట పక్కన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఇబ్రహీంపట్నంలో దాసరి ధర్మారావు ఒంటరిగా ఉంటున్నాడు.



మద్యం మత్తులో విద్యుత్ స్తంభం ఎక్కాడు. విద్యుత్ తీగలను పట్టుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆ సమయంలో విద్యుత్ ట్రిప్ అయి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రాణాపాయం తప్పింది. విద్యుదాఘాతంతో ధర్మారావు కాళ్లకు గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం 108లో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు బాధితుడు చెప్పడం లేదు. ఇబ్రహీంపట్నం ఎస్సై రవివర్మ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కార్యకర్తల నిర్ణయమే శిరోధార్యం

● స్థానిక ఎన్నికల్లో సమిష్టి కృషితో 100% స్ట్రైక్ రేట్ సాధిద్దాం ● పార్టీకి నష్టం కలిగిస్తే ఆఫీసు మెట్లు కూడా ఎక్కనివ్వను ● మైలవరం నియోజకవర్గ టిడిపి కార్యకర్తల విస్తృత సమావేశంలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్






**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 23(వార్తా ప్రభ ప్రతినిధి):**మైలవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం బుధవారం ఇబ్రహీంపట్నంలోని ముత్తవరపు వారి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మైలవరం శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. తొలుత అన్న ఎన్టీఆర్ ప్రతిమకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా ఐక్యతతో పనిచేస్తూ తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత కోపాలు, ద్వేషాలకు రాజకీయాల్లో స్థానం ఇవ్వకుండా ప్రజల కోసం, ప్రాంత అభివృద్ధి కోసం పనిచేయడమే తన రాజకీయ విధానమని తెలిపారు. తన ఎనిమిదేళ్ల రాజకీయ ప్రయాణంలో వ్యక్తిగత ప్రయోజనాలు, ఎవరి మీద కోపం లేదా ద్వేషంతో తాను ఎప్పుడూ పనిచేయలేదని, మైలవరం ప్రాంతం, ప్రజల కోసం చేయగలిగిన ప్రతి పనిని చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ తెలుగు ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న వేదిక అని పేర్కొన్నారు.

**చంద్రబాబు, లోకేష్ ని స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలి** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ని స్ఫూర్తిగా తీసుకుని పార్టీ కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీ అంతర్గత విభేదాలు, గ్రూపు తగాదాలకు దూరంగా ఉంటూ ప్రభుత్వం--ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలని కోరారు. ప్రజలకు అందాల్సిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఎక్కడా అడ్డంకులు కల్పించకుండా వాటిని ప్రజలకు చేరేలా చూడాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రాబోయే మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పంచాయతీ తదితర స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలకు, ప్రజాక్షేత్రంలో బలం ఉన్న వారికి ప్రాధాన్యత కల్పించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని కోరారు. కూటమి భాగస్వామ్య పార్టీలైన జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలను కూడా కలుపుకుని ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనసేన, బీజేపీలతో కలిసి కూటమి ప్రభుత్వాన్ని నడుపుతున్నారని, కూటమి కుటుంబ సభ్యులంతా కలిసి పనిచేయడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలమని అన్నారు. తాను ఇప్పటికే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, ఇక తన దృష్టి పార్టీ శ్రేణుల గెలుపుపైనే ఉందని చెప్పారు. గ్రామంలోని వార్డు సభ్యుడి నుంచి సర్పంచ్, కౌన్సిలర్ వరకు పార్టీ తరపున పోటీ చేసే ప్రతి ఒక్కరి విజయానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన ఎంబిబిఎస్ రెండవ రౌండ్ అడ్మిషన్లను రద్దు చేయాలి

## నీట్ 31 వేల ర్యాంక్ అభ్యర్థికి రిజర్వేషన్ లో సీటు 73 వేల ర్యాంక్ అభ్యర్థికి ఓపెన్ కేటగిరి లో సీటా..?.



**గుంటూరు, సెప్టెంబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**డా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన ఎంబిబిఎస్ అడ్మిషన్స్ లో జరిగిన అవకతవకలపై విజయవాడలో బుధవారం జరిగిన ప్రెస్ మీట్ లో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్ ప్రసంగిస్తూ రిజర్వేషన్ అమలు నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఎంబిబిఎస్ రెండవ అడ్మిషన్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ డాక్టర్ ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన రెండవ రౌండ్ అడ్మిషన్లలో అనేక లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. జీవో నెంబర్ 102 ప్రకారం అభ్యర్థులు ప్రతి రౌండ్ లోను తమకు నచ్చిన ప్రాధాన్యతా క్రమంలో తమకు నచ్చినన్ని కాలేజీలకు ఆప్షన్స్ పెట్టుకోవచ్చని ఉంది. కాని బీసీ బీ కి చెందిన సాయి కార్తీక్ తండ్రి రామ కృష్ణ గౌడ్ అనే అభ్యర్థి 31325 నీట్ ర్యాంక్ తో యంఆర్సి లో గుంటూరు మెడికల్ కాలేజీలో సీటు పొందే అవకాశం ఉన్నా తాను మొదటి రౌండ్లో తక్కువ ఆప్షన్స్ పెట్టుకోవడం వలన అదే కాలేజీలో రిజర్వేషన్ల సీటు పొందవలసి వచ్చింది. అయితే తన పొరపాటును గ్రహించి 102 జీవో ప్రకారము రెండవ రౌండ్ లో ఎక్కువ ఆప్షన్స్ పెట్టుకుని తను చేసిన పొరపాటున సరిదిద్దుకోవాలని ప్రయత్నించాడు. అయితే రెండు కాలేజీల ఆప్షన్స్ పెట్టిన వెంటనే మిగిలిన ఆప్షన్స్ అన్ని కనపడకుండా పోయాయి. దీనివలన ఆ విద్యార్థి ప్రతిభ ఉండి కూడా ఓసి /యంఆర్సి లో సీటు పొందలేకపోయాడు. దీనివలన రిజర్వేషన్ సీటు కు అర్హుడైన ఒక విద్యార్థి నష్టపోయాడు. ఇలా చేయటం రిజర్వేషన్ వర్గాలకు నష్టం చేకూర్చాలని దుష్ట తలంపు ఈ కూటమి ప్రభుత్వానికి ఉందని స్పష్టంగా తెలుస్తుంది. ఈ విధంగా నష్టపోయిన వారు వివిధ రిజర్వేషన్ కేటగిరీలకు చెందిన వారు రాష్ట్రంలో దాదాపు 70 మంది ఉన్నారు. వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, హెల్త్ సెక్రటరీ, హెల్త్ మినిస్టర్ రిజర్వేషన్ వర్గాల వారు అయినప్పటికీ రిజర్వేషన్ వర్గాలకు నష్టం జరుగుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం రిజర్వేషన్ వర్గాలకు పదవులు ఇవ్వడమే కానీ అధికారం ఇవ్వడం లేదనేది సుస్పష్టం అన్నారు. మెరిట్ లిస్టు ప్రకారం రిజర్వేషన్ అభ్యర్థులు, జనరల్ కేటగిరి అభ్యర్థులు సరి సమానంగా ఉన్నా రెండవ రౌండ్లో కేటాయించిన ఓ.సి. సీట్లలో 90% కేవలం ఓ.సి. లే ఉండే విధంగా సాఫ్ట్ వేర్ ను తయారుచేసి రిజర్వేషన్ వర్గాల అభ్యర్థులు ఓపెన్ క్యాటగిరిలో కి రాకుండా అడ్డుకున్నారన్నారు. ప్రభుత్వం రెండవ రౌండ్ ను రద్దు చేయకుంటే ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ లకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని అన్నారు. ఈ సందర్భంగా మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒక అభ్యర్థికి తనకు నచ్చిన క్రమంలో తనకు నచ్చినన్ని కాలేజీలకు ఆప్షన్స్ పెట్టుకోవడానికి ఉన్న హక్కుని అడ్డుకునే అధికారం ప్రభుత్వానికి ఎక్కడ ఉందని అన్నారు. అభ్యర్థులు ఎక్కువ ఆప్షన్స్ పెట్టుకోవాలని అలా పెట్టుకోకుంటే రిజర్వేషన్ కేటగిరి అభ్యర్థులు ఓపెన్ క్యాటగిరి లోకి వెళ్లే అవకాశం కోల్పోతారని పత్రికా విలేకరుల సమావేశంలో పేర్కొన్న వైస్ ఛాన్సర్ మరియు రిజిస్ట్రార్లు ఎక్కువ ఆప్షన్స్ పెట్టుకోవడానికి ప్రయత్నించిన బీసీ బి అభ్యర్థిని ఎందుకు అడ్డుకున్నారని నిలదీశారు. ప్రతి రౌండ్ లోను మెరిట్ లిస్టు దామాషా ప్రకారం జనరల్ కేటగిరి సీట్లలో అన్ని కేటగిరీల అభ్యర్థులకు సమాన అవకాశాలు వచ్చే విధంగా సాఫ్ట్వేర్ను రూపొందించాలని కోరారు. రెండవ రౌండ్ రద్దుచేసి ప్రతి అభ్యర్థికి తనకు నచ్చిన క్రమంలో తనకు నచ్చినన్ని కాలేజీలకు ఆప్షన్స్ పెట్టుకోవడానికి ఉన్న హక్కుని కాపాడవలసిన బాధ్యత యూనివర్సిటీ పై ఉందని పేర్కొన్నారు

# ఎంపీటీసీలను సన్మానించిన ఎంపీపీ నెర్సు రాజ్యలక్ష్మి





**కంకిపాడు సెప్టెంబర్ (వార్త ప్రభ, ప్రతినిధి)** కంకిపాడు మండల పాలకవర్గం ఐదేళ్ల పదవీకాలం విజయవంతం -- సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపిన ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మికంకిపాడు మండల పరిషత్ పాలకవర్గం ఏర్పడి ఐదు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో అభినందన సభను నిర్వహించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ దులుపుడి కిషోర్ , ఎంపీడీవో బసవయ్య కంకిపాడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులను సన్మానించారు. ఈ అభినందన సభకు వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని వారికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, మండల సమగ్ర అభివృద్ధికి గడిచిన ఐదేళ్లలో తోడ్పాటునందించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. గత ఐదు సంవత్సరాల కాలంలో ఎంపీటీసీలందరూ ఎంతగానో సహకరించి మండల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఎంపీడీవో, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మరియు మండల అధికారులు నిరంతరం సమన్వయంతో పనిచేయడం వల్లే ప్రజా సమస్యలను పరిష్కరించగలిగామని కొనియాడారు. తనకు ఎంపీపీగా ప్రజాసేవ చేసే గొప్ప అవకాశాన్ని కల్పించి, నిరంతరం ప్రోత్సహించిన మంత్రి కొలుసు పార్థసారథికి ప్రత్యేకంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. గత రెండేళ్ల కాలంలో శాసనసభ్యులు బోడే ప్రసాద్ విలువైన సలహాలు, సూచనలు అందిస్తూ అండగా నిలిచారని తెలిపారు. మండల నిధులు సరిపోని క్లిష్ట సమయాల్లో ప్రత్యేక నిధులను సమకూర్చి మండల ప్రగతిని ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. గతంలో సర్పంచ్‌గా సేవలందించిన నాటి నుండి నేడు ఎంపీపీగా ఎదిగే వరకు వెన్నంటి నిలిచి ప్రోత్సహించిన నెరుసు సతీష్‌కు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తాము చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి చేరవేసిన మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వర్షంలో సైతం వీఆర్ఏల సమ్మె!

**గుడ్లవల్లేరు:సెప్టెంబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండలంలోని గ్రామ రెవిన్యూ సహాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం వర్షంలో సైతం సమ్మె చేశారు. వీఆర్ఏల ఉద్యమానికి సీపీఎం మండల నాయకుడు పిడుగు దేవసహాయం మద్ధతు ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘ గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడు ఉదుముల రవికుమార్, ఆ సంఘ నాయకులు చార్లెస్, కిరణ్, ఫైజుల్లా, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

# షహీద్-ఏ-ఆజమ్ రావు తులారామ్ జీకి శతకోటి నమస్సులు మరియు ఘన నివాళి

## నివాళి - షహీద్-ఏ-ఆజమ్ రావు తులారామ్ జీ




రావు తులారామ్ సింగ్ (09 డిసెంబర్ 1825 23 సెప్టెంబర్ 1863) 1857లో జరిగిన ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలోని ప్రముఖ విప్లవ నాయకులలో ఒకరు. భారతదేశంలో ఆయనను "జననాయకుడు"గా స్మరించుకుంటారు. 1857 స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో హర్యానాలోని నైరుతి ప్రాంతం నుంచి బ్రిటిష్ పాలనను తాత్కాలికంగా తొలగించడంలో, అలాగే ఢిల్లీలో పోరాడుతున్న విప్లవ సైనికులకు సైనిక బలం, ధనం మరియు యుద్ధ సామగ్రిని సమకూర్చడంలో రావు తులారామ్ జీ కీలక పాత్ర పోషించారు. భారతదేశాన్ని బ్రిటిష్ పాలన నుంచి విముక్తి చేయాలనే లక్ష్యంతో విదేశీ పాలకుల సహాయం పొందేందుకు ఆయన భారతదేశాన్ని విడిచి వెళ్లారు. ఇరాన్ మరియు ఆఫ్ఘనిస్తాన్ పాలకులను కలుసుకుని భారత స్వాతంత్ర్య పోరాటానికి సహాయం కోరారు. రష్యా చక్రవర్తి జార్‌తో కూడా సంబంధాలు ఏర్పరచుకునేందుకు ఆయన ప్రయత్నాలు చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాంతం పోరాడిన రావు తులారామ్ జీ కేవలం 37 సంవత్సరాల వయస్సులో 23 సెప్టెంబర్ 1863న కాబూల్‌లో మరణించారు. రావు తులారామ్ జీ 09 డిసెంబర్ 1825న హర్యానా రాష్ట్రంలోని రేవాడీ పట్టణంలో ఒక అహీర్ (యాదవ) కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి పేరు రావు పూరన్ సింగ్, తల్లి పేరు జ్ఞాన్ కున్వర్. ఆయన తాత పేరు రావు తేజ్ సింగ్. 1857 స్వాతంత్ర్య సంగ్రామంలో రావు తులారామ్ జీ మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్తో పాటు ఢిల్లీలోని విప్లవకారులకు కూడా సహకారం అందించారు. బ్రిటిష్ సైన్యానికి వ్యతిరేకంగా అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. 16 నవంబర్ 1857న నారనౌల్ ప్రాంతంలో బ్రిటిష్ సైన్యంతో వీరోచితంగా యుద్ధం చేశారు. 1857 విప్లవ సమయంలో రావు తులారామ్ జీ తనను తాను స్వతంత్ర పాలకుడిగా ప్రకటించుకుని "రాజా" బిరుదును స్వీకరించారు. దేశ రక్షణ కోసం నసీబ్‌పూర్లో బ్రిటిష్ సైన్యానికి వ్యతిరేకంగా జరిగిన చారిత్రక యుద్ధంలో ఆయన అపారమైన ధైర్యసాహసాలతో పోరాడారు. ఈ పోరాటంలో పెద్ద సంఖ్యలో అహీర్ (యాదవ) వీరులు మాతృభూమి కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారు. తదుపరి పోరాటానికి సంబంధించిన వ్యూహాలను రూపొందించేందుకు రావు తులారామ్ జీ రావు రామ్‌బక్ష్ సింగ్ను బ్రజ్‌ఘాట్, హాపూర్‌లో కలుసుకున్నారు. అలాగే అవధ్ వీరనారి బేగం హజ్రత్ మహల్తో కూడా సంప్రదింపులు జరిపారు. అనంతరం సైనిక సహాయం పొందే ఉద్దేశంతో ఇరాన్ మరియు ఆఫ్ఘనిస్తాన్‌కు వెళ్లారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఈ మహా విప్లవ వీరుడు తన చిన్న వయస్సులోనే తుదిశ్వాస విడిచారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం తన సర్వస్వాన్ని త్యాగం చేసిన మహానాయకుడు, అమర విప్లవ వీరుడు, ధీర యోధుడు షహీద్-ఏ-ఆజమ్ రావు తులారామ్ జీ వర్ధంతి సందర్భంగా వారికి శతకోటి నమస్సులు మరియు ఘన నివాళులు. రావు తులారామ్ జీ యొక్క త్యాగం, ధైర్యం, దేశభక్తి మరియు వీరత్వం భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయి.

**- గొర్ల యశ్వంత్ రాజ్ యాదవ్**

. రాష్ట్ర యూత్ అధ్యక్షులు: అఖిల భారత యాదవ మహాసభ, తెలంగాణ

# యల్ బి ఆర్ సి ఇ విద్యార్థులకు ఓ ఎన్ జి సి ఫౌండేషన్ స్కాలర్షిప్



**మైలవరం సెప్టెంబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి):**స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరానికిగానుఓ ఎన్ జి సి (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్) ఫౌండేషన్ స్కాలర్షిప్ ను సాధించారు. ఒక్కో విద్యార్థికి రూ. 48 వేలు చొప్పున మొత్తం రూ. 5.28 లక్షలు విద్యార్థుల బ్యాంకు అకౌంట్స్ లో జమ అవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు తెలిపారు. ఓ ఎన్ జి సి స్కాలర్షిప్ పొందిన విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాస రెడ్డి , ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు అభినందించారు. వివిధ సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సామజిక సేవ) కింద అందించే ఉపకార వేతనాలను విద్యార్థులు అందిపుచ్చుకోవడానికి కృషి చేస్తున్న గూడూరు నాగి రెడ్డి సేవలను ప్రశంసించారు.

# గుడ్లవల్లేరు ఎస్.ఐగా సురేష్‌బాబు....



**గుడ్లవల్లేరు:సెప్టెంబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండల సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా కొండపల్లి సురేష్‌బాబు విధుల్లో చేరనున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్.ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ ఉయ్యూరు రూరల్ మండలానికి బదిలీపై వెళ్లారు. అదే పోలీస్‌స్టేషన్‌లో ఎస్.ఐగా పని చేసిన సురేష్‌బాబు గురువారం గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్‌లో విధులు చేపట్టనున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

# గుడివాడలో భారీ వర్ష బీభత్సం

-కారుపై కూలిన మహావృక్షం..
తృటిలో తప్పిన పెను ప్రమాదం..












**గుడివాడ,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** అల్పపీడన ప్రభావంతో గుడివాడ పట్టణంలో బుధవారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు నీటమయమయ్యాయి.

**ఆర్డీఓ కార్యాలయం వద్ద బీభత్సం :** భారీ వర్షానికి ఆర్డీఓ కార్యాలయం రోడ్డులో ఉన్న భారీ వృక్షం ఒక్కసారిగా విరిగిపడి అక్కడ పార్క్ చేసిన వాహనాలపై పడింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో వాహనాల్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది యంత్రాల సహాయంతో వృక్షాన్ని ముక్కలుగా కట్ చేసి రోడ్డుపై నుంచి తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం తొలగింది. ప్రకృతి విపత్తు సమయంలో వేగంగా స్పందించిన అగ్నిమాపక సిబ్బందిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

**రోడ్లన్నీ జలమయం :** మరోవైపు భారీ వర్షానికి బస్టాండ్ పరిసర ప్రాంతాలు, ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతాలు, పట్టణంలోని పల్లపు ప్రాంతాల్లోని అంతర్గత రహదారులు నీట మునిగాయి. రోడ్డుపై గుంతలు ఎక్కడున్నాయో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డ్రైనేజీ వాటర్ రోడ్డుపైకి రావడంతో దుర్గంధంతో పాదచారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ మరో 24 గంటల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, నీరు నిలిచిన ప్రాంతాలు, విద్యుత్ స్తంభాలు, చెట్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని కోరారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన నలుగురు వ్యక్తులకు 40 వేలు జరిమానా విధించిన కోర్ట

**మచిలీపట్నం,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురు వ్యక్తులకు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు 40,000 జరిమానా విధించింది. నగరంలోని చిలకలపూడి ఇనగదురు పోలీస్ స్టేషన్ల వారు ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ దాడులను నిర్వహించారు. వీరిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా గా విచారణ జరిపిన న్యాయమూర్తి భూపతిన శ్రీనివాస్ ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున జరిమానా విధించారు.

## శ్రీ స్వామివారి ఉత్సవ లడ్డూల వేలంపాట వాయిదా !



**గుడివాడ,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీ విఘ్నేశ్వర స్వామి వారికి దేవస్థానంలో స్వామి వారు ఉత్సవ లడ్డూల బహిరంగ వేలంపాటను వాయిదా వేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల కమిటీ చైర్మన్ సాయన రాజేష్, ఈ.వో యార్లగడ్డ వాసు తెలిపారు. బుధవారం ఉదయం జరగాల్సిన వేలంపాటకు భక్తులు తక్కువ సంఖ్యలో హాజరు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆలయ మండపంలో చైర్మన్ రాజేష్, ఈవో వాసు వివరాలు వెల్లడించారు. 25వ తేదీ శుక్ర వారం ఉదయం 10 గంటలకు స్వామివారి 20 కిలోల, 10 కిలోల ఉత్సవ నేతి లడ్డూల వేలంపాట జరుగుతుందని కావున భక్తులు గమనించగలరని వారు తెలిపారు. దేవస్థాన నిబంధనల ప్రకారంగానే వేలంపాట వాయిదా వేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు, ముళ్ళపూడి రమణమూర్తి, విక్కుర్తి పోతురాజు, వీరమాచినేని శైలజ, చాపరాల విజయలక్ష్మి, సోసుపల్లి శారద, గొంతుపల్లి కనకదుర్గ, గణపతి శాస్త్రి, దేవస్థాన సిబ్బంది నారాయణ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపి వైద్యుల రాష్ట్ర మహాసభ 25న

**గుడివాడ,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** ఈనెల 25వ తేదీ శుక్రవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆర్ఎంపి వైద్యుల రాష్ట్ర మహాసభ జరుగుతుందని రూరల్ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాగిరాజు ఉదయ భాస్కరరాజు, దాసు వెంకట నాగేశ్వరరావు లు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. బృందావనం కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నారని, ఆర్ఎంపీ ఫెడరేషన్ కు సంబంధించి లంక దాసరి ప్రసాదరావు, యామర్తి నాగేశ్వరరావు, కరెళ్ళ గణపతిరావు, కోలా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొంటారని వారు తెలిపారు.

## గుడివాడలో అంబరాన్నంటిన గణేష్ నిమజ్జన వేడుకలు





**గుడివాడ,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** "జై బోలో గణేష్ మహరాజ్ కీ జై" నినాదాలతో గుడివాడ పురవీధులు దద్దరిల్లాయి. తీన్మార్ డప్పులు, కేరళ వాయిద్యాలు, శక్తి ప్రదర్శనలతో గణపయ్య నిమజ్జన ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. పట్టణంలోని మెయిన్ రోడ్డు శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం, మార్కెట్ ప్రాంతంలో మాజీ మున్సిపల్ చైర్మన్, ఎన్టీఆర్ స్టేడియం ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు ల ఆధ్వర్యంలో 9 రోజుల పాటు గణేష్ నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. 10వ రోజు నిమజ్జన వేడుకలను అత్యంత వైభవంగా చేశారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి నిమజ్జన ఊరేగింపును ప్రారంభించారు. ఊరేగింపులో కళాకారులతో కలిసి తాను కూడా డప్పు కొడుతూ యువతలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడులవాడైన గుడివాడ ఆధ్యాత్మికతకు నిలయమని అన్నారు. విఘ్నేశ్వరుడి కరుణతో ప్రజల విఘ్నాలన్నీ తొలగి, పట్టణం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వచ్చే ఏడాది వేడుకలను మరింత ఘనంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టేడియం వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాత్రగడ్డ రవి, గోర్జి సత్యనారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షులు పంద్రాజు సాంబయ్య, చేకూరు జగన్మోహనరావు, వేణుగోపాల స్వామి గుడి చైర్మన్ అంగడాల సతీష్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహాగణపతికి మహా వీడ్కోలు చెప్పిన ఆర్యవైశ్యులు





**విస్సన్నపేట,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో కుక్కడపు మోహనరావు ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఆవరణలో మహాగణపతి సంబరాలు పూర్తి అయిన సందర్భంగా నిమజ్జనం కార్యక్రమం భారీగా నిర్వహించారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఊరేగింపులో ఆర్యవైశ్య సామాజిక వర్గ యువత వందలాది మంది పాల్గొన్నారు. లడ్డు ప్రసాదమును పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 51 వేల రూపాయలకు పోటీ పాటలో పాడుకొనీ పట్టు వస్త్రాలతో సన్నాయి మేళాలతో పూజా కార్యక్రమాల అనంతరం భక్తిశ్రద్ధలతో స్వామివారి మహా లడ్డు ప్రసాదాన్ని నెత్తిన పెట్టుకొని గణేశా లంబోదర విఘ్నేశ్వర మహాగణపతి వినాయక అనే నామాలు స్మరిస్తూ తీసుకువెళ్లటం జరిగిందని నిర్వాహకులు తెలియజేశారు.

## భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం

● ఎద్దుల బండిపై శ్రీ తిరుపతమ్మ క్షేత్ర గణనాథుడి శోభాయాత్ర...

**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో గత తొమ్మిది రోజులుగా అత్యంత వైభవంగా జరిగిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి,నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని వినాయకుడికి అర్చకులు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు,

**సాంప్రదాయ వాయిద్యాల మోత - ఎద్దుల బండిపై ఊరేగింపు...** పూజా కార్యక్రమాలు అనంతరం, స్వామివారి విగ్రహాన్ని సాంప్రదాయ పద్ధతిలో అందంగా అలంకరించిన ఎద్దుల బండిపై ఉంచారు, మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, భక్తుల కోలాటాల నడుమ గణనాథుడి శోభాయాత్ర అత్యంత వైభవంగా సాగింది, భక్తుల జయజయధ్వానాలు, గణపతి బొప్పా మోరియా నినాదాలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి,ఈ ఊరేగింపులో ధర్మకర్తల మండల చైర్మన్ చుంచు.రమేష్ బా బు దంపతులు, ధర్మకర్తల సభ్యులు పాల్గొని స్వామివారికి నీరాజనాలు పలికారు, శోభాయాత్ర అనంతరం సాంప్రదాయ పద్ధతిలో, వేద మంత్రోచ్చారణల నడుమ వినాయక విగ్రహాన్ని స్థానిక మున్నేరు నదిలో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ జంగం.శ్రీనివాసరావు, పాలక మండలి చైర్మన్ చుంచు రమేష్ బాబు పాలకమండలి సభ్యులు, అర్చకులు, దేవస్థాన సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.



## కోడూరు మండలాన్ని కరువు మండలం గా ప్రకటించాలి

● ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన



**కోడూరు,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** కోడూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం కోడూరు మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల నేతలు నిరసన తెలియజేసారు. తహశీల్దార్ కే. పూర్ణచంద్రరావు కు రైతులతో కలిసి సమస్యలతో కూడిన పలు వినతిపత్రలు అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కోసూరు శివ నాగేంద్రం మాట్లాడుతూ వెంటనే గ్రామాలలో త్రాగునీటి చెరువులలో నింపాలని, సాగుకు నోచుకోని రైతులకు 20 వేల కరువు భృతి ప్రకటించాలని, వ్యవసాయ కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, 8 రకాల నిత్యవసర సరుకులు రేషన్ దుకాణాలలో అందించాలని కోరారు. అవుట్ పాల్స్ స్లూయిజ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని, 22ఎ నిషేధిత జాబితా నుంచి రైతుల భూములకు విముక్తి కలిగించాలని కోరారు. రైతాంగ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచికర్ల రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శీలం నారాయణరావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఆవుల బసవయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పోలాబత్తిన మోహన్రావు, రైతు సంఘం కోడూరు మండల నాయకులు రేపల్లె యోగ ప్రకాష్, బత్తిన రాజగోపాలరావు, వృత్తిదారుల నాయకులు చెక్కా వెంకటేశ్వరావు, సిఐటియు నాయకులు విక్టోరియా, దీవెనమ్మ, రైతులు దేవనబోయిన తాతయ్య ఇజ్జినేని నాగేశ్వరావు, పొలం కోటయ్య పోలబెట్టిన గోపాలకృష్ణ పొనమాల కోటయ్య, రాములు, జొన్నలగడ్డ రాజగోపాలరావు, కంచర్లపల్లి రామాంజనేయులు, రంగారావు, కోట సుబ్బారావు, దోవాడ నాగయ్య, శ్రీరాంపురం ఎస్టీ కాలనీవాసులు ఉప్పు పోలేరమ్మ నక్క వెంకటేశ్వర్లమ్మ, తుమ్మ వెంకటేశ్వరమ్మ, పి.పాండురంగారావు తుమ్మ ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఉమ్మడి తూర్పు జిల్లా పరిషత్ పాలన

● అనుకున్న స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయామని జడ్పిటిసిల ఆవేదన ● పూర్తి వైసీపీ సమావేశంగా మారిన వైనం



**కాకినాడ,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** గడిచిన ఐదేళ్ల జిల్లా పరిషత్ పాలనలో అనుకున్న స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయామని జిల్లాకు చెందిన జడ్పిటిసి సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు లేక ఎన్నో అభివృద్ధి పనులు ఆగిపోయాయంటూ వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సమావేశం పూర్తి వైసీపీ పార్టీ సమావేశంగా మారిపోయింది. బుధవారం తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చివరి సమావేశం అధ్యక్షుడు విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్‌గా విప్పర్తి వేణుగోపాలరావు ఐదేళ్ల పాలనా కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. 2021--2026 స్థానిక సంస్థల ఎన్నికల్లో పి గన్నవరం నియోజకవర్గం నుంచి జడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయన, అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. కోవిడ్ లాంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ నిరంతరాయంగా పాలన సాగిస్తూ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారు.

**కీలక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు:** మంచినీటి సౌకర్యం:లి 14, 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.100.00 కోట్ల వ్యయంతో 64 సిపిడబ్ల్యూఎస్ పథకాల ద్వారా తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టారు. మౌలిక వసతులు: రూ.1,118.00 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 1,500 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

**గ్రామీణ రోడ్లు & డ్రైనేజీలు:** గ్రామీణ పంచాయతీ రహదారులు, సీసీ డ్రెయిన్లు, శ్మశాన వాటికలు, కమ్యూనిటీ భవనాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వ్యవసాయ గోదాములు, కాలువల పూడికతీత పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేశారు.

**ఎస్‌సి, ఎస్‌టి కాలనీల అభివృద్ధి:** ఆర్ఆర్, ఉపాధి హామీ పథకాల ద్వారా దళిత, గిరిజన వాడల్లో మౌలిక వసతులు కల్పించారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని నాలుగు జిల్లాలకు నిధులను సమానంగా కేటాయిస్తూ, రాజకీయాలకు అతీతంగా సుపరిపాలన అందించిన విప్పర్తి వేణుగోపాలరావుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్సీ గుత్తుల సూర్యనారాయణ బాబు, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు బుర్ర అనుబాబు, మేరుగు పద్మలత, స్టాండింగ్ కమిటీ చైర్మన్ రొంగల పద్మావతి, సీఈవో వివివిఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో డి శ్రీ లలిత, జడ్పిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## కోడూరు లో సింహాద్రి వికాస్ జన్మదిన వేడుకలు



**కోడూరు,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** అవనిగడ్డ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు తనయుడు, యువ నాయకుడు సింహాద్రి వికాస్ జన్మదిన వేడుకలను కోడూరు మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్‌ను కట్ చేసి సింహాద్రి వికాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ యాదవ్రెడ్డి వెంకట సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పరిశే మాధవరావు, నాయకులు బడే హేమగంగాధరరావు, తిమ్మన వెంకట నాంచారయ్య, బండే నాగరాజు,పేరే శ్రీనివాసరావు, తిమ్మన శివకుమార్, యలవర్తి నాంచారయ్య, షాబు, మెండు అర్జునరావు పెద్ది మస్తాన్, కొండేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## లింగారెడ్డి పాలెంలో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



**కోడూరు,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** కోడూరు మండల పరిధిలోని లింగారెడ్డి పాలెం గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగం గా బుధవారం గణనాథుడి సన్నిధిలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో , ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు .

## మండల, జిల్లా పరిషత్ సభ్యులకు ఘన సత్కారం..



**కోడూరు,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** కోడూరుమండల పరిషత్, జిల్లా పరిషత్ సభ్యుల, పదవీకాలం నేటితో పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని కోడూరు మండల ఎంపీడీవో కార్యాలయం వద్ద ఇన్చార్జి ఎంపిడిఓ నాగ రేవతి ఆధ్వర్యంలో గెట్ టుగెదర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, జడ్పిటిసి యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులను, గ్రామ సర్పంచులను ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

## హనుమాన్ జంక్షన్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం



**హనుమాన్ జంక్షన్,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ వేలేరా రోడ్డులో వీరమాచినేని బుజ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి బుధవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. నవరాత్రులుగా ప్రత్యేక పూజలు అందుకున్న విఘ్నేశ్వరుడిని నిమజ్జనానికి తరలించే ముందు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళహారతులు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా నిమజ్జన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. భక్తిగీతాలు, నినాదాలతో పరిసర ప్రాంతం సందడిగా మారింది. గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వీరమాచినేని బుజ్జితో పాటు ఉత్సవ నిర్వాహకులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

# అమరావతిలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ

**● 2027 నాటికి ఎల్వీపీఈఐ సిఓఈ, ఐ హెల్త్ రిసోర్స్ సెంటర్**





**విజయవాడ,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** అమరావతిలోని ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ (ఎల్వీపీఈఐ) వారి సుధా & వెంకట్ జాస్తి క్యాంపస్‌కు బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం గ్రామంలో సుధా & వెంకట్ జాస్తి క్యాంపస్‌లో రాష్ట్రానికి సేవలందించే ఎల్వీపీఈఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీ ఓఈ ) మరియు ఐ హెల్త్ రిసోర్స్ సెంటర్ (కంటి ఆరోగ్య వనరుల కేంద్రం) ఏర్పాటు చేయనున్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను 2027 సెప్టెంబర్ నాటికి రోగులకు వైద్య సేవలు అందించేలా ప్రారంభించాలనే ప్రణాళిక రూపొందించారు. ఈ క్యాంపస్ ను 10 ఏళ్ల కాలంలో మొత్తం 8 లక్షల చదరపు అడుగుల నిర్మిత విస్తీర్ణంతో అభివృద్ధి చేయనున్నారు. ఈ సందర్భంగా ఎల్వీపీఈఐ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గుళ్లపల్లి ఎన్. రావు మాట్లాడుతూ ఈ నేత్ర వైద్యశాల క్యాంపస్‌ను తృతీయ స్థాయి నేత్ర వైద్య కేంద్రంగా ( మొదటి దశలో అభివృద్ధి చేయనున్నామన్నారు. తొలి దశ 2027 నాటికి రోగులకు వైద్య సేవలు అందుబాటులోకి తెస్తుంది. రెండో దశలో విజన్ రిహాబిలిటేషన్ ఇన్‌స్టిట్యూట్, ఎల్డర్లీ ఐ కేర్ మరియు చైల్డ్ సైట్ ఇన్‌స్టిట్యూట్ కార్యకలాపాలను ప్రారంభించుటకు మరియు మూడో దశలో ఐ అండ్ బ్రెయిన్ ఇన్‌స్టిట్యూట్, ఎడ్యుకేషన్ అకాడమీ మరియు కమ్యూనిటీ ఐ హెల్త్ విభాగాలను ఏర్పాటు చేయుటకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఎల్వీపీఈఐ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్ మాట్లాడుతూ "అమరావతి అభివృద్ధి మరియు ప్రగతికి ఒక ముఖ్యమైన కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. సుధా & వెంకట్ జాస్తి క్యాంపస్ ద్వారా ఈ అభివృద్ధి ప్రయాణంలో మేము భాగస్వామ్యం కావడం మాకు ఎంతో గౌరవంగా భావిస్తున్నాం అన్నారు. తొలి దశలో తృతీయ స్థాయి నేత్ర వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ప్రజలు నివసించే ప్రాంతాలకు మరింత చేరువగా అధునాతన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురానున్నాం అన్నారు. తదుపరి దశల్లో ఈ క్యాంపస్‌ను సమగ్రంగా అభివృద్ధి చేయనున్నాం మరియు ఈ సమగ్ర విధానం ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు కూడా ప్రయోజనం చేకూర్చే ఒక సమగ్ర కేంద్రాన్ని నిర్మించగలమని ఆశిస్తున్నాం," అన్నారు.

**అమరావతి క్యాంపస్ సెంట్రల్ ఆంధ్రప్రదేశ్..** (సీఏపీ) కోసం రూపొందించిన మరింత విస్తృతమైన దృష్టికోణంలో ఒక భాగం. ఇది విజయవాడ, తాడిగడపలో ఇప్పటికే ఉన్న మా క్యాంపస్‌కు తోడ్పాటుగా ఉంటుంది. అలాగే ఏలూరుకు సమీపంలోని వంగూరులో రాబోయే మా క్యాంపస్‌కు కూడా ఇది అనుసంధానమవుతుంది. ఈ కేంద్రాలన్నీ కలిసి తృతీయ స్థాయి మరియు ప్రత్యేక వైద్య సేవలు, ప్రాథమిక నేత్ర వైద్యం, విద్య, పరిశోధన, పునరావాసం మరియు కమ్యూనిటీ సేవలను అనుసంధానించే ఒక సమగ్ర వ్యవస్థ ద్వారా ఈ ప్రాంతమంతటా ఎల్వీపీఈఐ సేవలను మరింత విస్తృతంగా అందించగలుగుతాము అని చెప్పారు. ఈ భూమి పూజా కార్యక్రమంలో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు కందుల దుర్గేష్, వై. సత్యకుమార్ యాదవ్, పి. నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌పై సిఎం సానుకూలం : మంత్రి నారాయణ

**● సీఆర్‌డీఏ కమిషనర్, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శితో వెంటనే మాట్లాడుతా**



**విజయవాడ,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌కు త్వరితగతిన పరిష్కారం చూపే దిశలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయిడు సానుకూలంగా ఉన్నారని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేసారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సీఆర్‌డీఏ కమిషనర్‌తో పాటు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శితో వెంటనే మాట్లాడి హౌసింగ్ స్కీమ్‌పై తగిన కార్యాచరణ చేపడతామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి మార్గనిర్దేశకత్వంలో ఆయన ఆలోచనల మే-రకు కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళతామని వివరించారు. బుధవారం విజయవాడ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు నారాయణను కలిసి సొసైటీ సభ్యుల గృహ నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ అంశాలను వివరించారు. సుప్రీంకోర్టు మాజీ రిజిస్ట్రార్ జనరల్ నుంచి పొందిన న్యాయ నిపుణుల అభిప్రాయాన్ని మంత్రికి సమర్పించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 107, దాని అమలుకు సంబంధించిన విధివిధానాలు, హౌసింగ్ స్కీమ్‌పై తొలిగిపోయిన న్యాయపరమైన అపోహలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించి జారీ అయిన అన్ని జిఓలను పురపాలక పట్టణాభివృద్ధి శాఖే విడుదల చేసిందని, ప్రస్తుతం అమలు బాధ్యత కూడా ఆ శాఖపైనే ఉందని పత్రికా ప్రతినిధులు నారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. సొసైటీ ప్రతినిధుల వివరాలను విన్న మంత్రి నారాయణ, ఈ అంశాన్ని సంబంధిత అధికారులతో వెంటనే చర్చించి ముందుకు తీసుకెళ్లతామని స్పష్టం చేశారు. సీఆర్‌డీఏ కమిషనర్‌తో మాట్లాడటంతో పాటు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శితో కూడా చర్చిస్తానని తెలిపారు. పాత్రికేయిల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, తమది జర్నలిస్టు స్నేహపూర్వక ప్రభుత్వమని మంత్రి పేర్కొన్నారు. అమరావతి రాజధాని నిర్మాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో కీలకమని నారాయణ అన్నారు. రాజధాని నిర్మాణం వేగంగా ముందుకు సాగుతున్న సమయంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో ముఖ్యమని, వారి సంక్షేమానికి సంబంధించిన అన్ని అంశాలను సానుకూలంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ అంశంపై గతంలోనే మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఐ అండ్ పీఆర్ కమిషనర్ విశ్వనాథన్ సొసైటీ ప్రతినిధులతో జరిపిన చర్చల్లో సానుకూల వైఖరి వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల సమన్వయంతో ముందుకు వెళ్లే అవకాశాలను వారు వివరించారు. ఇప్పటి వరకు జరిగిన పరిణామాలకు కొనసాగింపుగా మంత్రి నారాయణ తాజాగా ఇచ్చిన హామీతో సీఆర్‌డీఏ స్థాయిలో తదుపరి ప్రక్రియ కదలికలోకి వస్తుందనే ఆశాభావం సొసైటీ ప్రతినిధుల్లో వ్యక్తమవుతోంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ స్కీమ్‌కు ప్రభుత్వ స్థాయిలో పరిష్కారం లభిస్తుందని వారు ఆశిస్తున్నారు. మంత్రి నారాయణను కలిసిన వారిలో అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పాటిబండ్ల నాగ శ్రీనివాస్, వ్యవస్థాపక కార్యదర్శి చావా రవి, ది పయనీర్ చీఫ్ ఆఫ్ బ్యూరో డాక్టర్ రవి కుమార్ బొప్పన, ది హిందూ డిప్యూటీ ఎడిటర్ తిరువాయిపాటి శ్రీనాథ్, , హన్స్ ఇండియా రెసిడెంట్ ఎడిటర్ శ్యామ్ సుందర్,ఆంధ్ర ప్రభ చీఫ్ ఆఫ్ బ్యూరో నేరెళ్లకుంట గోపి, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రెసిడెంట్ ఎడిటర్ మల్లేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు కృష్ణారావు, రామకృష్ణ (ఢిల్లీ) పాల్గొన్నారు.

# స్థానిక సమరానికి సిద్ధం కండి.. కూటమి సత్తా చాటాలి

**● ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకోవద్దు ● మహిళా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట: పోలవరపు లక్ష్మీరాణి**



**విజయవాడ,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కూటమి నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సమన్వయంతో పనిచేయాలని టీడీపీ నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి కూటమి బలం, ఐక్యత ఏంటో ఎన్నికల్లో చూపించాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని అన్నారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని లక్ష్మీరాణి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు చేసే విమర్శలు, ఆరోపణలను పట్టించుకోకుండా ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు.

**డీఎస్సీపై వైసీపీ రాద్ధాంతం..** డీఎస్సీ అంశంపై వైసీపీ చేస్తున్న విమ-ర్శలను లక్ష్మీరాణి తప్పుబట్టారు. ఈ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకునేందుకే ప్రతిపక్షం రాద్ధాంతం చేస్తోందని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. వాస్తవాలను ప్రజలకు వివరించకుండా రాజకీయ విమర్శలకు దిగడం సరికాదన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రతిపక్షాల విమర్శల కంటే ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలే ముఖ్యమని అన్నారు. పార్టీ శ్రేణులు ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించాలని సూచించారు.

**మహిళా అభివృద్ధికి ప్రాధాన్యం..** కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని లక్ష్మీరాణి పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత ముందుకు వెళ్లేలా ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళల ప్రయాణ సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదేనని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల అనేక కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గిందన్నారు. విద్య, ఉద్యోగాలు, వ్యాపార అవసరాల కోసం మహిళలు స్వేచ్ఛగా ప్రయాణించే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు.

**ఐక్యంగా ముందుకు..** స్థానిక ఎన్నికల్లో కూటమి శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని లక్ష్మీరాణి కోరారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి పార్టీ ప్రయోజనాలు, ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి కూటమి నాయకులు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారి సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. స్థానిక ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రతి నాయకుడు, కార్యకర్త చురుకుగా పనిచేయాలని పోలవరపు లక్ష్మీరాణి పిలుపునిచ్చారు.

# ఎన్టీఆర్ కాలనీ వైసీపీ నాయకుడు పూజలు

**విస్సన్నపేట,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో ఎన్టీఆర్ కాలనీలో వైసీపీ మండల నాయకులు సానం సతీష్ దంపతులు వినాయక నవరాత్రులలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నములు నిరోధించాలని కొత్త జోష్ తో తాము ముందుకు వెళ్లాలని కాలనీవాసులు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కాలనీకి మౌలిక సదుపాయాలు సంపూర్ణంగా అధికారులు కలిగించాలని మహాగణపతిని కోరుకుంటున్నామన్నారు.



# గత ఐదేళ్ల నా సేవా ప్రయాణం విజయవంతం గా ముగించడం ఆనందంగా ఉంది - ఎంపీపీ ఇస్లావతు ప్రసన్న రాణి స్వామి

**● ఇకముందు కూడా మీ అందరి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను....**







**మైలవరం,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** మైలవరం మండల ప్రజలందరి ఆశీస్సులతో మండల పరిషత్ అధ్యక్షురాలిగా (వీరా) బాధ్యతలు స్వీకరించి, ఈ రోజుతో ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు చాలా ఆనందంగా ఉంద ని ఇస్లావతు ప్రసన్న రాణి స్వామి అన్నారు. బుధవారం ఆమె వార్తా ప్రభ ప్రతినిధితో మాట్లాడుతూ 2026 సెప్టెంబర్ 23వ తేదీన పదవీకాలం ముగిసిందని వెల్లడించారు.ఈ ఐదేళ్ల పదవీ కాలంలో మండలాభివృద్ధికి నా శాయశక్తులా కృషి చేశానన్నారు.ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగాను.ఈ ప్రయాణంలో నాకు వెన్నుదన్నుగా నిలిచిన నా కుటుంబ సభ్యులకు పెద్దలకు,ప్రజాప్రతినిధులకు,ప్రభుత్వ అధికారుల కు మరియు ముఖ్యంగా నన్ను నమ్మి ఆదరించిన మండల ప్రజలందరికీ పేరుపేరునా నా శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. పదవి అనేది ఒక బాధ్యత మాత్రమే...,ప్రజల ప్రేమ, అభిమానం, ఆశీస్సులే జీవితాంతం నిలిచే నిజమైన సంపద.ఈ ప్రయాణంలో నాకు తోడుగా నిలిచిన ప్రతి ఒక్కరి ప్రేమాభిమానాలను నేను ఎప్పటికీ మ-రువలేను.పదవిలో ఉన్నా లేకపోయి నా, మీ ప్రసన్న రాణి స్వామి ఎల్లప్పుడూ మీ అభివృద్ధి కోసం, మీ సమస్యల పరిష్కారం కోసం అందుబాటులోనే ఉంటాను.ఇకముందు కూడా మీ అందరి ప్రేమాభిమానాలు, ఆశీస్సులు, ఆదరణ నాకు ఇలాగే ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్న రాణి స్వామి పేర్కొన్నారు.



**జగన్మోహన్ రెడ్డి వల్లే నాకు ఎంపీపీ అవకాశం:** మాజీ ముఖ్యమంత్రి,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకులు వైయస్ జగన్మోహన్ రెడ్డి వల్లే మైలవరం మండల పరిషత్ అధ్యక్షురాలిని అయ్యానని ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్న రాణి అన్నారు.గడచిన ఐదేళ్లలో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం మరియు మౌలిక వసతుల కల్పన ద్వారా స్థానిక మండలాన్ని మరియు గ్రామాలను ఎంతో అభివృద్ధి చేసుకోగలిగామని, ప్రజాప్రతినిధుల సహకారం, అధికారుల సమష్టి కృషితోనే మండలాన్ని అభివృద్ధి చేసుకోగలిగా మన్నారు.ఐదేళ్ల పాలన ఎంతో సంతృప్తిని ఇచ్చిందని ప్రసన్న రాణి వెల్లడించారు.ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఐదేళ్లపాలన విజయవంతంగా ముగించడం ఆనందంగా ఉందన్నారు.

# ఈ నెల 30న పేదలకు పట్టాభిషేకం..

**● గౌరవ సీఎం చేతుల మీదుగా పండగ వాతావరణంలో పట్టాల పంపిణీ ● తొలిదశలో 24,042 మంది లబ్ధిదారులకు పట్టాలు ● క్రమబద్ధీకరణతో పేదల చేతుల్లో రూ. 23,213 కోట్ల విలువైన ఆస్తి ● అన్ని హక్కులతో ప్రజల దశాబ్దాల కల నెరవేరుతున్న శుభవేళ ● ఇంకా ఎవరైనా మిగిలితే రెండో దశలో వారి సమస్యలనూ పరిష్కరిస్తాం ● ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




**విజయవాడ,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** పేదల ఆత్మగౌరవాన్ని కాపాడటం, ప్రతి పేద కుటుంబానికి శాశ్వత చిరునామా, పూర్తి హక్కులతో కూడిన ఆస్తి భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 30న విజయవాడలో గౌరవ ముఖ్యమంత్రి చేతులమీదుగా పండగ వాతావరణంలో పట్టాల పంపిణీ జరగనుందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. తొలిదశలో జిల్లా వ్యాప్తంగా 24,042 మంది లబ్ధిదారులకు రూ. 23,213 కోట్ల మార్కెట్ విలువ కలిగిన ఆస్తి క్రమబద్ధీకరణ ద్వారా పేదల చేతికి అందుతుందని పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో ఎంపీ కేశినేని శివనాథ్.. శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ నెల 30వ తేదీన జరిగే కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇది ప్రజల ప్రభుత్వమని.. పేదల క్షేమం, సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. 1970, 1980ల్లో, తదుపరి సంవత్సరాలలో జారీచేసిన ఎన్‌టీఆర్ పట్టాలు, ఇతర పట్టాలకు సంబంధించి 12,710 మంది లబ్ధిదారులకు జీవోఎంఎస్ నెం.306 ద్వారా మేలు జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ భూముల్లో ఉంటున్న 2,586 మంది లబ్ధిదారుల కేసులను జీవోఎంఎస్ నెం.30 ద్వారా పరిష్కరించి, క్రమబద్ధీకరించడం జరిగిందన్నారు. 8,746 మంది ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్ (పీవోటీ) ఉల్లంఘనదారుల సమ-స్య కూడా పరిష్కారమైందన్నారు. ఇలా ఎన్.టి.ఆర్. జిల్లా పరిధిలోని విజయవాడ పశ్చిమ, విజయవాడ తూర్పు, విజయవాడ మధ్య, గన్నవరం, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు నియోజకవర్గాల పరిధిలో 24,042 మంది లబ్ధిదారులకు చెందిన 616.56 ఎకరాల (దాదాపు 29,84,145 చదరపు గజాలు) భూమికి సంబంధించి ప్రైవేటు ఆస్తికి సమానంగా అన్ని హక్కులతో పట్టాల పంపిణీ జరుగుతుందన్నారు. ఇందుకు గౌరవ ముఖ్యమంత్రికి ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ ప్రజల దశాబ్దాల కల నెరవేరుతోందని.. రెండో దశలోనూ మిగిలిన వారి సమస్యలు పరిష్కారమవుతాయని, అందరికీ న్యాయం జరుగుతుందని వివరించారు. సమష్టి కృషి, పటిష్ట సమన్వయం కారణంగా ఇది సాధ్యమైందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు.

**ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ..** వివిధ సమావేశాల్లో చర్చించి, సమస్య పరిష్కారానికి కృషిచేయడం జరిగిందని, దశాబ్దాలుగా జఠిలంగా ఉన్న సమస్యను పరిష్కరించి, పేదలకు భరోసా కల్పించినందుకు గౌరవ సీఎం, గౌరవ డిప్యూటీ సీఎంలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఏవైనా ఉంటే వాటిని కూడా పరిశీలించి క్రమబద్ధీకరించడం జరుగుతుందన్నారు.

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ..** ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు సమష్టిగా కృషిచేసి పట్టాల పంపిణీకి సన్నద్ధమైనట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు, నియమనిబంధనలను అనుసరించి పట్టాలు అందించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# గురువులపై దాడి విద్యా వ్యవస్థపై దాడే..

**● బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**● ఏపీ ఎన్‌జీజీవోస్ నగర శాఖ అధ్యక్షులు సీహెచ్. సీవీఆర్ ప్రసాద్, కార్యదర్శి ఎస్‌కే. నజీరుద్దీన్**



**విజయవాడ,సెప్టెంబర్ 23 (వార్తాప్రభ) :** ఉపాధ్యాయులను అవమానించడం, వారిపై దాడులకు పాల్పడటం అత్యంత ఖండనీయమని ఏపీ ఎన్జీవో విజయవాడ నగరశాఖ అధ్యక్షులు సీహెచ్. సీవీఆర్ ప్రసాద్, కార్యదర్శి ఎస్‌కే. నజీరుద్దీన్ పేర్కొన్నారు. గురువులపై దాడి చేయడం అంటే విద్యా వ్యవస్థపై దాడి చేయడమేనని.. గురువులను అవమానించడం అంటే సమాజాన్ని అవమానించడమేనని సీహెచ్. సీవీఆర్ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో అన్నారు. ఉపాధ్యాయులు తమ సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే హక్కు కలిగి ఉన్నారని ఆయన పేర్కొన్నారు. తమ సమస్యలను తెలియజేసేందుకు సాప్ కార్యాలయం వచ్చిన ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం ఏమాత్రం సమర్థనీయం కాదని అన్నారు. ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన బాధ్యులను వెంటనే గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులకు తగిన రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో విజయవాడ నగరశాఖ కార్యదర్శి ఎస్‌కే. నజీరుద్దీన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల గౌరవం, హక్కులు, భద్రత విషయంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుంది. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైన ప్రతి సందర్భంలో సంఘం ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, విద్యార్థులకు విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను నేర్పే గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు. గురువు గౌరవం.. సమాజ గౌరవం.. అనే భావనను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని సీహెచ్. సీవీఆర్ ప్రసాద్, ఎస్‌కే. నజీరుద్దీన్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా విధులు నిర్వహించేలా, వారి గౌరవం, హక్కులు, భద్రతకు ప్రభుత్వం పూర్తి భరోసా కల్పించాలని వారు కోరారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188